యువతరం న్యూస్ The Voice of youth

సోమవారం 13-04-2026

# 'బ్రహ్మోస్'పై ఆసక్తి చూపిస్తున్న ఆగ్నేయాసియా దేశాలు...!

ఢిల్లీ: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో భారత్ ప్రాధాన్యత అంతకంతకూ పెరుగుతోంది. ముఖ్యంగా, దక్షిణ చైనా సముద్రంలో చైనా దూకుడును ఎదుర్కొనేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్ వైపు ఆశగా చూస్తున్నాయి. ఇందులో భాగంగా, భారత్-రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని సమకూర్చుకోవడంపై అమిత ఆసక్తి కనబరుస్తున్నాయి. ఫిలిప్పీన్స్ తర్వాత తాజాగా ఇండోనేషియా కూడా బ్రహ్మోస్ క్షిపణుల కొనుగోలుకు నిర్ణయం తీసుకోవడమే దీనికి నిదర్శనం. భారత్... ఆగ్నేయాసియాను బ్రహ్మోస్ క్షిపణికి కీలక మార్కెట్‌గా పరిగణిస్తోంది. శబ్దం కంటే వేగంగా (మాక్ 2.8 నుంచి 3 మధ్య వేగంతో) ప్రయాణించే ఈ క్షిపణి, తన కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించగలదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇది నిరూపితమైంది. సుమారు 400 కిలోమీటర్ల పరిధి కలిగిన బ్రహ్మోస్‌ను భూమి, సముద్రం, గాలి, జలాంతర్గాముల వివిధ ఉపరితలాల నుంచి ప్రయోగించవచ్చు. ఈ ప్రత్యేకతల కారణంగా, చైనా నౌకాదళ దూకుడును నిలువరించేందుకు ఇది సరైన ఆయుధమని ఆగ్నేయాసియా దేశాలు భావిస్తున్నాయి. ఈ మేరకు 'ఇండియా నరేటివ్' తన కథనంలో వివరాలను వెల్లడించింది. ఇండియా నరేటివ్ నివేదిక ప్రకారం, దక్షిణ చైనా సముద్ర తీర దేశాలైన వియత్నాం, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా వంటివి తమ నిరోధక సామర్థ్యాలను (ాాత్అ-ాా౨౨వం/ాతీము ణవఅఋశ్రీ -ాా2/ాణ) పెంచుకోవడంపై దృష్టి సారించాయి. చైనా ఇప్పటికే శక్తివంతమైన ాా2/ాణ వ్యవస్థలను అభివృద్ధి చేయగా, బ్రహ్మోస్ వంటి క్షిపణులతో చిన్న దేశాలు కూడా అదే తరహా వ్యూహాన్ని అనుసరించి తమ సముద్ర జలాలను కాపాడుకోగలవని నివేదిక పేర్కొంది. ఇదే సమయంలో, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అమెరికా తన క్షిపణి, నౌకాదళ వనరులను ఇండో-పసిఫిక్ నుంచి తరలిస్తోంది. దీంతో చైనా దూకుడును ఎదుర్కోవడంలో అమెరికా ఇచ్చే భద్రతా హామీలపై ఆగ్నేయాసియా దేశాల్లో అపనమ్మకం పెరుగుతోంది. అమెరికా 2025 జాతీయ భద్రతా వ్యూహంలో కూడా ఈ ప్రాంతానికి ప్రాధాన్యత తగ్గించడం వారి ఆందోళనలను మరింత పెంచింది. ఈ నేపథ్యంలో, తమ సైనిక సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలతో భాగస్వామ్యాలను విస్తరించుకుంటున్నాయి. భారత్ ఇప్పటికే 2024లో ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణులను అందించింది. ఇప్పుడు ఇండోనేషియాతో ఒప్పందం కుదుర్చుకుంది. వియత్నాంతో దాదాపు 700 మిలియన్ డాలర్ల ఒప్పందానికి కూడా చేరువలో ఉంది. ఈ పరిణామాలు కేవలం ఆయుధ విక్రయాలుగానే కాకుండా, విస్తృత ఇండో-పసిఫిక్ భూ-వ్యూహాత్మక క్షేత్రంలో భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## శాంతి చర్చల వేళ చైనాపై అమెరికా సంచలన ఆరోపణ!

ఢిల్లీ: అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చల వేళ అమెరికా తన నిఘా వర్గాలను ఉటంకిస్తూ చైనాపై సంచలన ఆరోపణలు చేసింది. డ్రాగన్ కంట్రీ ఇరాన్‌కు రహస్యంగా విమాన విధ్వంసక క్షిపణులను సరఫరా చేస్తోందని ఆరోపించింది. ఇస్లామాబాద్ వేదికగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం ఇరాన్‌తో చర్చలకు సిద్ధమవుతున్న సమయంలో ఈ ఆరోపణలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అమెరికా నిఘా వర్గాల ప్రకారం.. చైనా నుంచి ఇరాన్‌కు మ్యాన్‌ప్యాడ్స్ అందుతున్నాయి. భుజంపై నుంచి ప్రయోగించే ఈ క్షిపణులు తక్కువ ఎత్తులో ప్రయాణించే యుద్ధ విమానాలు, హెలికాప్టర్లను సులభంగా కూల్చివేయగలవు. అంతర్జాతీయంగా విమర్శలు రాకుండా ఉండేందుకు చైనా ఈ ఆయుధాలను నేరుగా కాకుండా మూడో దేశం ద్వారా ఇరాన్‌కు చేరవేస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం అమలులో ఉన్న కాల్పుల విరమణ సమయాన్ని ఇరాన్ తన ఆయుధ సంపత్తిని తిరిగి సమకూర్చుకోవడానికి ఉపయోగించుకుంటోందని అమెరికా అనుమానిస్తోంది. ఒకవేళ యుద్ధం మళ్లీ మొదలైతే ఈ క్షిపణులు అమెరికా విమానాలకు పెను ముప్పుగా మారతాయని ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలో 'మమ్మల్ని మోసం చేయాలని చూడొద్దు' అని జేడీ వాన్స్ ఇప్పటికే ఇరాన్‌ను గట్టిగా హెచ్చరించారు. అయితే, ఈ ఆరోపణలను చైనా ఖండించింది. తాము ఏ దేశానికీ ఆయుధాలు సరఫరా చేయడం లేదని, బాధ్యతాయుతమైన దేశంగా శాంతి చర్చలకే మద్దతిస్తామని వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఈ తాజా పరిణామాలతో ఇస్లామాబాద్ చర్చలపై నీలినీడలు కమ్ముకున్నాయి. చైనా తన వైఖరి మార్చుకోకపోతే, వచ్చే నెలలో జరగాల్సిన ట్రంప్-జిన్‌పింగ్ భేటీపైనా దీని ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ప్లాన్ బీ లేదు.. ఇరాన్‌తో చర్చలకు ముందు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

ఢిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా, ఇరాన్ మధ్య ఉన్నతస్థాయి చర్చలు పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో ప్రారంభమయ్యాయి. అయితే, ఈ చర్చలు విఫలమైతే తమ వద్ద ఎలాంటి ప్రత్యామ్నాయ ప్రణాళిక (ప్లాన్ బీ) లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సైనిక శక్తిని తాము పూర్తిగా దెబ్బతీశామని, అందుకే ప్లాన్ బీ అవసరం లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ చర్చల కోసం ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ గాలిబాఫ్, విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరగ్చీలతో కూడిన ప్రతినిధి బృందం ఇస్లామాబాద్ చేరుకుంది. వారికి పాకిస్థాన్ మంత్రి ఇషాక్ దార్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ స్వాగతం పలికారు. అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. పారిస్ నుంచి బయలుదేరే ముందు వాన్స్ ఇరాన్‌ను హెచ్చరించారు. "వారు మాతో ఆడుకోవాలని ప్రయత్నిస్తే, మా చర్చల బృందం అంత సుముఖంగా ఉండదు" అని స్పష్టం చేశారు. గత కొన్ని వారాలుగా క్షిపణి దాడులతో అట్టుడికిన గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం రెండు వారాల కాల్పుల విరమణ అమలవుతోంది. ఈ ప్రశాంత వాతావరణంలోనే చర్చలు జరుగుతున్నప్పటికీ, అమెరికా తన బలగాలను పశ్చిమాసియాలో మరింతగా మోహరించడం ఉద్రిక్తతలను పెంచుతోంది. చర్చలకు ముందే ఇరు దేశాలు తమ తమ డిమాండ్లతో ముందుకు వచ్చాయి. అమెరికా 15 పాయింట్ల ఫ్రేమ్‌వర్క్‌ను ప్రతిపాదించగా, ఇందులో ఇరాన్ తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను అప్పగించాలని, సైనిక పరిమితులను అంగీకరించాలని షరతులు విధించినట్లు సమాచారం. దీనికి ప్రతిగా ఇరాన్ 10 పాయింట్ల ప్రణాళికను పంపింది. యుద్ధ నష్టపరిహారం చెల్లించాలని, హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమత్వాన్ని అమెరికా గుర్తించాలని కోరింది. "ఇరాన్ సైన్యం ఓడిపోయింది. వారి వద్ద కొన్ని క్షిపణులు, పరిమిత తయారీ సామర్థ్యాలు మాత్రమే ఉన్నాయి. మా సైన్యం అద్భుతంగా పని చేసింది. వారిని గట్టిగా దెబ్బతీశాం" అని ట్రంప్ విలేకరులతో అన్నారు. మరోవైపు వచ్చే వారం లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య కూడా చర్చలు జరగనుండటం ఈ ప్రాంతంలో దౌత్యపరమైన ప్రయత్నాలకు సూచికగా నిలుస్తోంది.

## బీసీ మహిళల ఉప కోటా కోసం ఢిల్లీని గడగడలాడిస్తాం: కల్వకుంట్ల కవిత

హైదరాబాద్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితో చట్టసభల్లో బీసీ మహిళలకు ఉప కోటా సాధించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పూలే జయంతి వేడుకల సందర్భంగా బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు స్థానం కల్పించకపోవడంపై కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బీసీ మహిళలకు ఉప కోటా ఇవ్వకపోవడం అంటే పాలకులకు ఆ వర్గాల పట్ల గౌరవం లేదని అర్థమని, కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా మరోసారి పూలే పుట్టారా అన్నట్లుగా జాగృతి ఆధ్వర్యంలో ఉద్ధృత పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు. పార్లమెంట్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మహిళా బిల్లుపై జరగనున్న చర్చా సమయంలో తాను స్వయంగా ఢిల్లీకి వెళ్లి వివిధ రాజకీయ పార్టీల నేతలను కలుస్తానని కవిత వెల్లడించారు. కేవలం మెజారిటీ ఉందన్న అహంకారంతో బీసీలకు అన్యాయం చేస్తూ బిల్లును ఆమోదిస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. మరోవైపు రాష్ట్రంలో పూలే విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహం పెట్టాలని డిమాండ్ చేస్తే... ట్యాంక్ బండ్ వద్ద పెడతామని చెప్పి, ఇప్పటికీ పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. కనీసం అంబేద్కర్ జయంతి నాటికైనా ఆ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల సమస్యలపై కూడా కవిత ఈ సందర్భంగా గళమెత్తారు. వారి క్రమబద్ధీకరణ కోసం జరుగుతున్న పోరాటానికి జాగృతి పూర్తి మద్దతు ఇస్తుందని, కొత్తగూడెంలో జరుగుతున్న ఆందోళనల్లో తమ నాయకులు పాల్గొంటారని ప్రకటించారు. గతంలో ఆర్టిజన్ల వేతనాలు పెంచడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందని గుర్తు చేస్తూ, ఇప్పుడు వారిపై ప్రభుత్వం చర్యలకు దిగాలని చూడటం సరికాదన్నారు. పూలే చూపిన సామాజిక న్యాయం బాటలో నడుస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## జగన్ పేరులో 'గన్' ఉంది, వైఎస్ అవినాశ్ రెడ్డి పేరులో 'వినాశనం' ఉంది

అమరావతి: ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తన సోదరుడు, వైసీపీ అధినేత జగన్ పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఏపీ రాజధానికి 'మావిగన్' అని పేరు పెట్టాలన్న జగన్ ప్రతిపాదనను ఆమె తీవ్రంగా ఎగతాళి చేశారు దీనికి కౌంటర్‌గా, పులివెందుల నియోజకవర్గానికి 'అవి గొడ్డలి' అని పేరు మార్చాలంటూ సంచలన సెటైర్ వేశారు. ఈ వ్యాఖ్యలు ఏపీ రాజకీయాల్లో పెను దుమారం రేపాయి. జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' ఆలోచనను పూర్తిగా అపహాస్యం చేసిన షర్మిల, వైసీపీ సిద్ధాంతంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఎంతసేపు గన్నులు, గొడ్డళ్లేనా? నరకాలి, చంపాలి, నాశనం చేయాలనే ఆలోచిస్తారా?" అని ఆమె ప్రశ్నించారు. జగన్ పేరులో 'గన్' ఉందని, వైఎస్ అవినాశ్ రెడ్డి పేరులో 'వినాశనం' ఉందని, వారి ఆలోచనా విధానం కూడా హింస చుట్టూనే తిరుగుతుందని ఆమె ఆరోపించారు. వివేకా హత్య కేసును పరోక్షంగా ప్రస్తావిస్తూ, "అమరావతికి మీ పేరు మీద 'మావిగన్' అని పెడితే, పులివెందులకు అవినాష్ రెడ్డి పేరు మీద 'అవి గొడ్డలి' అని పెట్టాలి" అని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ రాజధాని అమరావతి కోసం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని షర్మిల విమర్శించారు. అధికారంలోకి రాగానే ప్రజావేదికను కూల్చివేయడంతోనే పాలన మొదలుపెట్టారని గుర్తుచేశారు. "ఇప్పుడు అమరావతి వద్దు, మావిగన్ పెడతారట. ఈ ఐడియా అంత అద్భుతంగా ఉంటే, ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు అమలు చేయలేదు?" అని ఆమె నిలదీశారు. 'మావిగన్'కు ఖర్చు తక్కువైతే, మరి మూడు రాజధానుల ప్రతిపాదన ఎందుకు తెరపైకి తెచ్చారని ప్రశ్నించారు. జగన్ 'మావిగన్' ప్రతిపాదనపై తమ వైఖరి ఏంటని అడుగుతున్నారని, ఎవరైనా ఓ జోక్ వింటే గట్టిగా నవ్వాలి తప్ప స్పందించాల్సిన అవసరం లేదని ఆమె కొట్టిపారేశారు. ఇదే సందర్భంలో, గతంలో నిండు సభలో వైఎస్ విజయమ్మను అవమానించినందుకు మంత్రి బొత్స సత్యనారాయణ ఎంత ఏడ్చినా తక్కువేనని కూడా షర్మిల వ్యాఖ్యానించారు.

# పాజిటివ్ పాలిటిక్స్ చేస్తూ పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి

మొదటి పేజి తరువాయి

పార్టీ శ్రేణులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అదే సమయంలో, పార్టీ శ్రేణులకు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత ఇస్తున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తల ఆర్థిక స్వావలంబన కోసం 'జు3' (ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్) అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన ప్రకటించారు. పార్టీ సీనియర్ నేతల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణా శిబిరాల్లో చంద్రబాబు చాలా చురుగ్గా పాల్గొంటున్నారు. శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో కలిసి కాఫీ తాగుతూ, వారితో నేరుగా సంభాషిస్తున్నారు. ఈ సందర్భంగా రాజకీయ, పరిపాలన అంశాలపై తన సుదీర్ఘ అనుభవాన్ని పంచుకుంటున్నారు. గతానుభవాలు, ప్రస్తుత ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను వారికి వివరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలు తీరుపై కార్యకర్తల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "క్లీన్ అండ్ గ్రీన్, క్లీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్న మనం, క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం. క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా ప్రతి కార్యకర్త పనిచేయాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేస్తూ, పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి. గతంలో కంటే టీడీపీ ఓటు బ్యాంకు పెరగాలి," అని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. కార్యకర్తల ఆర్థిక బలోపేతంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సీఎం తెలిపారు. "పార్టీ నేతలు, కార్యకర్తల కోసం జు3 ప్రోగ్రాం తీసుకొస్తాం. నీతి, నిజాయతీలతో కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్' కార్యక్రమం చేపడతాం" అని హామీ ఇచ్చారు. "నా కుటుంబం కోసం ఏ విధంగా ఆలోచించానో, టీడీపీ కుటుంబం కోసం కూడా అదే విధంగా ఆలోచిస్తున్నాను" అని ఆయన పేర్కొనడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రత్యర్థి పార్టీల తీరును సమర్థంగా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని కూడా ఆయన దిశానిర్దేశం చేశారు.

## అందమైన ముసుగులో చేస్తున్న మోసం

మొదటి పేజి తరువాయి

ఎంతోమందికి ఏం జరిగిందో, వారిని ఎలా గెంటేశారో అందరికీ తెలుసు..' అని వ్యాఖ్యానించారు. 'నియోజకవర్గాల పెంపు అనేది అందమైన ముసుగులో చేస్తున్న మోసం. బీజేపీ పెడుతున్న ఈ మెలికల్లో వారి రాజకీయ స్వార్థం దాగుంది. గతంలో ఇలాగే హడావుడి చేసి రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చారు. రైతుల ఆందోళనతో మళ్లీ వెనక్కి తీసుకున్నారు. ఇప్పుడు ఈ బిల్లుపై సౌత్‌లో రియాక్షన్ వస్తే, బీజేపీ పాలిత చిన్న రాష్ట్రాలు సహా.. ఇతర చిన్న రాష్ట్రాలు వ్యతిరేకిస్తే కేంద్రం ఏం చేస్తుంది? ఈ బిల్లును అడ్డుకోవాల్సి వస్తే నేను కాదు ప్రజలే తిరగబడతారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపు (పునర్విభజన)తో రాష్ట్రాల మధ్య వివక్ష, అంతరాలు పెరుగుతాయని, ఫలితంగా ప్రజా ఉద్యమాలు తప్పవని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు చట్టాల్లాగే డీలిమిటేషన్ బిల్లును కూడా వెనక్కి తీసుకోకతప్పదని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర ద్రోహం చేస్తోందని అన్నారు. ఈ రాష్ట్రాలను రాజకీయంగా అణగదొక్కే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. ఇది పార్టీల సమస్య కాదని, ప్రాంతాల సమస్య అని చెప్పారు. 'ఇప్పటికే మేము తీవ్రమైన బాధతో ఉన్నాం.. గాయపడి ఉన్నాం.. మమ్మల్ని ఇంకా రెచ్చగొట్టొద్దు' అని హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లను దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ అమలు చేశారు. సోనియాగాంధీ గతంలోనే మహిళా రిజర్వే షన్ బిల్లును పెట్టారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల కోసం సీట్లు పెంచాల్సిన అవసరం ఏముంది? ఇప్పుడున్న 543 లోక్‌సభ స్థానాల్లోనే 181 సీట్లను మహిళలకు కేటాయించి రిజర్వేషన్లు అమలు చేయొచ్చు కదా? కేంద్రం లీకులు ఇస్తున్న ఇతర సవరణలపై ఇండియా కూటమితో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సీడబ్ల్యూసీ సమావేశంలో నిర్ణయించాం..' అని రేవంత్ తెలిపారు. 'నియోజకవర్గాలను ఏ ప్రాతిపదికన, ఎలా పెంచాలి అనే దానిపై కనీస చర్చ లేకుండా ఎందుకింత అర్జెంటుగా? దేశంలో 50 శాతం నియోజకవర్గాల పెంపు జరిగితే ఉత్తరాదికే పూర్తి అడ్వాంటేజ్‌గా మారుతుంది. కేవలం ఉత్తరాది రాష్ట్రాలతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే దుస్థితి వస్తుంది. చిన్న రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరగడమే కాకుండా ప్రాముఖ్యత కోల్పోతాయి. చిన్న రాష్ట్రాలు మరింత చిన్నగా, పెద్ద రాష్ట్రాలు మరీ పెద్దగా మారిపోతాయి. ఆర్థిక ప్రాతిపదికన, మెరిట్ డిజబిలిటీ విధానంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పెంపు ఉండాలి. చిన్న రాష్ట్రాలు, పెద్ద రాష్ట్రాల మధ్య ఇప్పుడున్న గ్యాప్ అలాగే కొనసాగాలి. ప్రస్తుతం కేరళ, యూపీ మధ్య 60 సీట్ల తేడా ఉంది. పునర్విభజన జరిగితే అది ఏకంగా 99కి పెరుగుతుంది. ఇది ముమ్మాటికీ చిన్న రాష్ట్రాలకు ఉరితాడు లాంటిదే. భవిష్యత్తులో ఉత్తరాది సీట్లు పెరిగితే.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంలో చోటు దక్కించుకున్న బండి సంజయ్, కిషన్‌రెడ్డి లాంటి దక్షిణాది బీజేపీ నేతలకు కనీసం చప్రాసీ పదవి కూడా దొరకదు..' అని సీఎం అన్నారు.

## హర్మూజ్‌లో కొత్త చిక్కు

మొదటి పేజి తరువాయి

అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి

ఢిల్లీ: పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో ప్రపంచం హర్మూజ్ జలసంధి పేరు తలవని రోజు లేదు. రెండు వారాల సీజ్ ఫైర్ మొదలైనా.. ఈ జలసంధి మాత్రం ఇంకా పూర్తిగా తెరుచుకోలేదు. అదీగాక హర్మూజ్‌లో ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలంటూ ఇరానే స్వయంగా ప్రకటన చేసింది. ఈ పరిస్థితికి సీమైన్స్ కారణం. ఆ జలమార్గంలో వాటిని ఏర్పాటుచేసిన ఆ దేశానికే ఇప్పుడు అవి ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియదట..! అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. తమపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించగానే ఇరాన్ హర్మూజ్‌ను బ్లాక్ చేయడం మొదలుపెట్టింది. జలసంధిని మూసివేశామని, అందులోకి ప్రవేశించే నౌకలకు నిప్పు పెడతామమని హెచ్చరించింది. కొన్ని నౌకలపై దాడులు కూడా జరిగాయి. తన శత్రుదేశాల నౌకలను అడ్డుకునేందుకు.. చిన్న పడవలను ఉపయోగించి సీమైన్స్ పరిచింది. దీంతో రవాణా పూర్తిగా పడిపోయి.. ఇంధన ధరలు భగ్గుమన్నాయి.

ఇప్పుడు ఆ సీమైన్స్ తలనొప్పిగా మారాయి. ఇరాన్ వాటిని చెల్లాచెదురుగా పరిచిందని, వాటిని ఉంచిన స్థానాలను రికార్డు చేసిందో లేదో, తెలియని పరిస్థితి నెలకొందని అమెరికా అధికారులను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఒకవేళ రికార్డు చేసినా.. వాటికి ఉన్న పరికరాలు కొట్టుకుపోయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అలాకూడా వాటిని ఉంచిన స్థానాలను గుర్తించి, తొలగించడం కష్టతరం అవుతుందని ఆ అధికారులు ఆందోళన వ్యక్తంచేశారు. వాటిని తొలగించే సామర్థ్యం కూడా దానివద్ద లేదని తెలుస్తోంది.

సీజ్‌ఫైర్ వేళ.. హర్మూజ్‌ను తెరవాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. దానికి తగ్గట్టుగా ఇరాన్ దానిని తెరవలేకపోతోంది. ప్రత్యామ్నాయ మార్గాలంటూ కొన్ని మ్యాప్‌లను విడుదల చేసింది. సాంకేతికంగా ఉన్న పరిమితులను పరిగణనలోకి తీసుకొని దానిని తెరుస్తామని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ (ాాఎఝం ాాతీఘ్రష్ట్రఎష్ట్రఱ) ఇటీవల వెల్లడించడం కూడా సీమైన్స్ సమస్యను తెలియజేస్తోందని అధికారులు ఆ అభిప్రాయం వ్యక్తంచేశారు. ఇక, హర్మూజ్‌ను ఇరాన్ పూర్తిగా తెరవకపోవడంపై ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈ శాంతి చర్చల్లో పురోగతి ఉంటుందో, లేదో తెలియని అనిశ్చితి నెలకొంది. ఇవన్నీ కలిసి యుద్ధం ఏ రూపు దాలుస్తుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది.

## మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు రాబోతున్నాయనడానికి ఈ సభలే నిదర్శనం

మొదటి పేజి తరువాయి



ఇంత భారీ సభను గుజరాత్‌లో కూడా ఏర్పాటు చేయలేకపోయేవారమని, మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు రాబోతున్నాయనడానికి ఈ సభలే నిదర్శనమని అన్నారు.

బీజేపీ వస్తే టీఎంసీ 15 ఏళ్ల అవినీతిపై శ్వేతపత్రం: మోదీ హామీ

ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్‌పై మోదీ తీవ్ర విమర్శలు చేశారు. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే, గత 15 ఏళ్ల టీఎంసీ పాలనలో జరిగిన అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని టీఎంసీ భయాందోళనలు సృష్టిస్తోందని, ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా నిలిపివేయబోమని స్పష్టం చేశారు. కేవలం తృణమూల్ నేతల అవినీతి, దోపిడీ దుకాణాలను మాత్రమే మూసివేస్తామని అన్నారు. తాము అధికారంలోకి వస్తే, కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలోని తొలి కేబినెట్ సమావేశంలోనే రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు తీర్మానం చేస్తామని మోదీ ప్రకటించారు. ఇన్నాళ్లూ ఈ పథకాన్ని అమలు చేయకుండా తృణమూల్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని, బీజేపీ ప్రభుత్వంతో ఆ రోజులు ముగిసిపోతాయని తెలిపారు.

చొరబాటుదారులు, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు

అంతేగాక కొత్త ప్రభుత్వం చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, వారికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఇక్కడ స్థిరపడటానికి సహాయం చేసిన వారిని కూడా వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

## పార్లమెంటు ప్రాంగణంలో అరుదైన దృశ్యం..

ఢిల్లీ: దేశ రాజకీయాల్లో ఉప్పు- నిప్పులా ఉండే ప్రధానమంత్రి మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ ప్రాంగణంలో ఒకరినొకరు పలకరించుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఈరోజు మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతిని పురస్కరించుకుని పార్లమెంట్ లోని 'ప్రేరణ స్థల్' వద్ద ఏర్పాటు చేసిన నివాళి కార్యక్రమంలో ఈ అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. తొలుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పూలే విగ్రహానికి నివాళులర్పించగా... అనంతరం ప్రధాని మోదీ, స్పీకర్ ఓం బిర్లా, రాహుల్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ పార్లమెంట్ ప్రాంగణానికి చేరుకోగానే సమయానికే రాహుల్ గాంధీ అక్కడకు చేరుకున్నారు. వాహనం దిగి వచ్చిన మోదీకి రాహుల్ మర్యాదపూర్వంగా నమస్కరించారు. అనంతరం ఇద్దరూ కాసేపు పలు విషయాలపై ముచ్చటించుకున్నారు. ప్రధాని ఏదో అడుగుతుండగా రాహుల్ దానికి సమాధానం ఇస్తున్నట్లుగా ఉన్న ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య తీవ్రస్థాయిలో రాజకీయ వాగ్యుద్ధం నడుస్తున్న తరుణంలో, పార్లమెంట్ సాక్షిగా ఇద్దరు అగ్రనేతలు ఇలా సౌహార్దపూర్వక వాతావరణంలో మాట్లాడుకోవడం విశేషం. సభలో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నప్పటికీ, దేశం గర్వించదగ్గ మహాత్ముని జయంతి వేడుకల్లో రాజకీయ విభేదాలను పక్కన పెట్టి కలిసి కనిపించడం ప్రశంసనీయం.

## జగిత్యాలలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

హైదరాబాద్: జగిత్యాలలో ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ కోసం గులాబీ శ్రేణులు సమరోత్సాహంతో సిద్ధమవుతున్నాయి. సుమారు లక్ష మంది జనసమీకరణే లక్ష్యంగా పార్టీ నాయకత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ సభకు సంబంధించి అనువైన ప్రదేశాన్ని ఖరారు చేసేందుకు పార్టీ ముఖ్య నేతలు క్షేత్రస్థాయిలో పర్యటించారు. జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వసంత తదితరులు కలిసి జగిత్యాలలోని ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానం, ఓల్డ్ బస్టాండ్ సమీపంలోని కాలేజీ గ్రౌండ్, మోతే రోడ్డు ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ఈ బహిరంగ సభకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడటానికి ప్రధాన కారణం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో మాజీ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధికారికంగా పార్టీలో చేరనుండటమే. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డపై కేసీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పోల్చితే ఈ రెండేళ్లలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ భారీ సభ ద్వారా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ తన పట్టును మరోసారి నిరూపించుకోవాలని భావిస్తోంది.

## రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతారు: కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణ సమాజాన్ని మోసం చేస్తూ, తన కుటుంబ సభ్యులు, అనుచరుల కోసం పేద ప్రజల భూములను అరాచకంగా లాక్కుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర చరిత్రలో ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్... ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగరడం న్యాయానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. మెజారిటీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ వైపు ఉన్నప్పటికీ, అక్రమంగా చైర్మన్ పదవులను దక్కించుకోవాలని కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు సాగలేదని అన్నారు. ముఖ్యంగా 'ఫోర్త్ సిటీ', 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రేవంత్ రెడ్డి భారీ భూ దందాకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఫార్మా సిటీ భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు అదే భూముల్లో కొత్త నగరాల పేరుతో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. భట్టి విక్రమార్క, సీతక్క వంటి నేతలు పాదయాత్రలు చేసి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఇప్పుడు అదనంగా మరో 16,000 ఎకరాలను సేకరించాలని చూడటం వెనుక రేవంత్ రెడ్డి సోదరులు, అనుచరుల ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించారు. ఉన్న సిటీలో దోమల నివారణ కూడా చేయలేని ప్రభుత్వం, ఫ్యూచరే లేని నాయకుడు ఫ్యూచర్ సిటీ కడతామంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇక నిషేధిత భూముల జాబితాను (22ఎ) అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో పెద్ద ఎత్తున సెటిల్మెంట్లు జరుగుతున్నాయని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 16 లక్షల ఎకరాలుగా ఉన్న నిషేధిత భూముల సంఖ్యను ఏకంగా కోటి ఎకరాలకు పెంచి, భూ యజమానులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ పెద్దలు కలెక్టర్లకు ఫోన్లు చేస్తూ భూ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలో స్థానిక ఎమ్మెల్యే అరాచకాలు పెచ్చుమీరాయని, హోటళ్లు, బార్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులకు భయపడకుండా నిలబడిన కార్యకర్తలకు అండగా ఉంటామని, నిబంధనలు అతిక్రమించి కాంగ్రెస్‌కు వత్తాసు పలికే అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టే ప్రసక్తి లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## కాల్పుల విరమణ తర్వాత... హర్మూజ్ దాటిన భారత తొలి ఎల్పీజీ ట్యాంకర్ జగ్ విక్రమ్

ఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తాత్కాలికంగా చల్లారడంతో నిలిచిపోయిన నౌకా రవాణా నెమ్మదిగా సాధారణ స్థితికి వస్తోంది. ఇందులో భాగంగా భారత 'జగ్ విక్రమ్' అనే ఎల్పీజీ ట్యాంకర్ కీలకమైన హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత ఈ మార్గంలో ప్రయాణించిన తొలి భారత నౌక ఇదే కావడం గమనార్హం. షిప్-ట్రాకింగ్ డేటా ప్రకారం... ఈ ట్యాంకర్ ఈరోజు మధ్యాహ్నానికి ఇది ఒమన్ సింధుశాఖలోకి ప్రవేశించి, తూర్పు దిశగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ముంబైకి చెందిన గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ కంపెనీ యాజమాన్యంలోని ఈ నౌక, దాదాపు 20,000 టన్నుల ఎల్పీజీని రవాణా చేస్తున్నట్లు వాణిజ్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు హర్మూజ్ జలసంధి ప్రాంతంలో దాదాపు 28 భారత నౌకలు చిక్కుకుపోయాయి. మార్చి ఆరంభం నుంచి ఇప్పటివరకు 9 నౌకలు పర్షియన్ గల్ఫ్ నుంచి బయటపడగా, మరో 15 భారత నౌకలు ఇంకా సురక్షిత మార్గం కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైంది. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే భారత్ వంటి దిగుమతులపై ఆధారపడిన దేశాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. జగ్ విక్రమ్ ప్రయాణం ఇంధన సరఫరాపై ఆందోళనలను కొంత తగ్గించినప్పటికీ, పలు నౌకలు ఇంకా చిక్కుకొని ఉండటంతో పరిస్థితి పూర్తిగా చక్కబడలేదని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## 'దీదీ'కి మైండ్ బ్లాంక్.. బెంగాల్ బరిలో బీజేపీ బ్రహ్మాస్త్రం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరంలో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రచార హోరును మరింతగా పెంచింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా విడుదల చేసిన 'సంకల్ప్ పత్ర' (మేనిఫెస్టో)ను తృణమూల్ కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు గండికొట్టేలా రూపొందించారు. ముఖ్యంగా మహిళలు, యువతను ఆకర్షించడంతో పాటు, బెంగాలీ సంస్కృతిని కాపాడేలా బీజేపీ చేసిన హామీలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారాయి. బీజేపీ మేనిఫెస్టోలోని ఐదు ప్రధాన అంశాలు ఇవే..

చొరబాట్లపై ఉక్కుపాదం

అక్రమ చొరబాట్లను ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేసిన బీజేపీ.. చొరబాటుదారులను గుర్తించి, దేశం నుంచి పంపించే (డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్) విధానాన్ని అమలు చేస్తామని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని తీసుకువస్తామని, అలాగే లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌లను అరికట్టేందుకు కఠిన చట్టాలు రూపొందిస్తామని హామీ ఇచ్చింది.

మహిళలకు పెద్ద పీట

మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు భారీ నజరానాలు ప్రకటించింది. టీఎంసీ ప్రభుత్వం ఇస్తున్న 'లక్ష్మీర్ భండార్' సాయం కంటే దాదాపు రెట్టింపుగా ప్రతి మహిళకు నెలకు రూ.3,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగాలు, పోలీసు శాఖలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు, 75 లక్షల మందిని 'లఖ్‌పతి దీదీ'లుగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేసింది.

## మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం: ఎంపీ అరవింద్..

దేశంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడమనేది చారిత్రక ఘట్టమని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. 2029 ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఇంత గొప్ప పండగ మరొకటి లేదని అరవింద్ పేర్కొన్నారు. ఈ బిల్లు ద్వారా చట్ట సభల్లో మహిళలకు ప్రాధాన్యం పెరుగుతుందన్నారు.మహిళా బిల్లుతో ఎస్సీ, ఎస్టీలకూ మంచి జరుగుతుందన్నారు. మహిళా రిజర్వేషన్లతో పారదర్శకత పెరిగి అవినీతి తగ్గుతుందని ఎంపీ అరవింద్ ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా బిల్లునూ రాజకీయం చేసేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఎంపీ అరవింద్ ఆగ్రహించారు. బీసీలను అనగదొక్కిందే కాంగ్రెస్ పార్టీ అంటూ విమర్శలు గుప్పించారు.

Yuvatharam News
యువతరం న్యూస్
The Voice of youth
సోమవారం 13-04-2026

## కృప అనాధ వృద్ధాశ్రమానికి 2 లక్షలు విలువగల గ్రాసరీస్ విరాళం







కర్నూల్ ప్రతినిధి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ :షేర్ ద విజన్ ఖమ్మం డిస్టిక్ వారు కర్నూలు ప్రాంతంలో కేర్ హోమ్స్ మిషన్ సొసైటీ వారు నడిపిస్తున్న కృప అనాధ వృద్ధాశ్రమంలో షేర్ ద విజన్ సొసైటీకి సంబంధించినటువంటి సెక్రటరీ వీరబాబు సార్ ఆధ్వర్యంలో దాదాపుగా 2 లక్షల రూపాయలు విలువ చేసేటువంటి గ్రసరీస్ ఫ్రిడ్జ్, కూలర్, టీవీ, రైస్, వాషింగ్ మిషన్ ఈ యొక్క వృద్ధాశ్రమానికి సహాయం చేయటం జరిగినది. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారైనటువంటి జి. లక్ష్మీనారాయణ టూరిజం అండ్ కల్చర్ ఆఫీసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, జి. రంగనాయకులు సార్ అడ్వకేట్ మద్దిలేటి సార్ వారు సతీమణి. ఆశ్రమ నిర్వాహకులు అబ్రహం, కృపము పాల్గొనడం జరిగినది.

## "కేఎంసిలో జనరల్ మెడిసిన్ జోనల్ సీఎంఇ"

### "మెడిసిన్ విభాగంలో లేటెస్ట్ అప్డేట్స్ పై చర్చ"








కర్నూల్ ప్రతినిధి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ :కర్నూల్ మెడికల్ కాలేజీ యందు జనరల్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నాడు జోనల్ స్థాయి సీఎంఇ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఎడియంఇ డా సుధాకర్ హాజరయ్యారు. ఈసీఈమెకి కర్నూల్ నంద్యాల అనంతపూర్ జిల్లాల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల జనరల్ మెడిసిన్ పీజీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సదస్సులో సాధారణ రోగాలు, నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్, మెటబాలిక్ డిస్ ఫంక్షన్, క్యాన్సర్ చికిత్స మొదలగు వివిధ అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీఎంసీ అబ్జర్వర్, బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్, జోనస్ సీఎఎమ్ఇ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీరాములు, హాస్పిటల్ డిప్యూటీ సూపర్నెంట్ డాక్టర్ శ్రీ లక్ష్మి, విశ్వ భారతి హాస్పిటల్ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి ఉ ప్రొఫెసర్ డాక్టర్ రవి కళాధర్ రెడ్డి ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈసీఎంఈ నందు వివిధ విభాగాల నిపుణులు డా శివ ప్రసాద్, డా. మోహన్ రెడ్డి, డా. సాయి సంపత్ కుమార్, డా. శ్రీనివాసులు, డా.మహేశ్వర్ రెడ్డి,డా. విద్యాసాగర్ తదితరులు హాజరయ్యి వివిధ ముఖ్య ఆరోగ్య సమస్యల చికిత్సల అప్డేట్స్ పై విద్యార్థులకు వివరించడం జరిగింది.

## ఘనంగా సయ్యద్ నియాజుల్లా మెడికల్ షాప్ ప్రారంభోత్సవం




కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ :కర్నూల్ నగరంలోని స్థానిక జోహారాపురం రోడ్డులో తాటి బెల్లం టి ఎదురుగా నాజర్ కాలనీ నందు సయ్యద్ మెడికల్ షాపును కర్నూలు జిల్లా వైయస్సార్సీపి పార్టీ జిల్లా అధ్యక్షుడు మరియు కర్నూల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఎస్వీ మోహన్ రెడ్డి మరియు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ రిటైర్డ్ ప్రొఫెసర్ జనరల్ మెడిసిన్ డాక్టర్ ఎస్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ సయ్యద్ మెడికల్ షాపును ప్రారంభించిన ప్రోప్రైటర్ నియాజుల్లాను అభినందించారు. బీఫార్మసీ చదివి క్వాలిఫైడ్ అయినవారే ఈ ఫార్మసీరంగంలో అడుగుపెడతారని ఇది చాలా గర్వించదగిన విషయమని తెలిపారు. ఇలాంటి బ్రాంచ్ లు మరెన్నో ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రొప్రైటర్ సయ్యద్ నియాజుల్లా మీడియాతో మాట్లాడుతూ నేను బీఫార్మసీ కోర్సు చదివాక నాకు అనుభవమైన రంగంలో రాణించినందుకు నేను ఈ మెడికల్ షాప్ ని ప్రారంభించాను అని అన్నారు. మావద్ద 20 శాతం డిస్కౌంట్ లో మందులు లభిస్తాయని తెలిపారు. కావున కర్నూల్ నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉబేదుల్లా, నూర్ మరియు వారి కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎల్ బెట్టింగ్, జూదం పై కఠిన చర్యలు

### కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్.



కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ :ఐపీఎల్ బెట్టింగ్ , మట్కా, జూద కార్యకలాపాలపై రాజీపడని కఠిన చర్యలు చేపట్టాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆదివారం జిల్లా ఎస్పీ జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణపై ముఖ్య సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్ నేపథ్యంలో జూద కార్యకలాపాలు కట్టడి చేయాలన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు.

**ఈ సందర్భంగా కర్నూలు ఎస్పీ మాట్లాడుతూ...**

ఐపీఎల్ మ్యాచ్‌లను ఆధారంగా చేసుకుని ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా జరుగుతున్న బెట్టింగ్ కార్యకలాపాలు యువతను తప్పుదారి పట్టిస్తున్నాయన్నారు. ఈ తరహా అక్రమ కార్యకలాపాలు కుటుంబాలను ఆర్థికంగా దెబ్బతీసే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. బెట్టింగ్ ఊబిలో కూరుకుపోయిన వ్యక్తులు దానిలో నుండి బయటపడలేక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయన్నారు.ఇలాంటి చర్యలు కేవలం వ్యక్తిగత జీవితశీ పైన నే కాకుండా, మొత్తం కుటుంబం పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, సమాజంలో నేరాల పెరుగుదలకు కూడా కారణమవుతున్నాయని కర్నూలు ఎస్పీ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లు తమ పరిధిలోని అనుమానాస్పద ప్రాంతాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెంచాలన్నారు. అలాగే క్రికెట్ బెట్టింగ్, మట్కా, జూద కేంద్రాలపై ప్రత్యేక దాడులు నిర్వహించాలన్నారు .ఎవరైనా ఈ కార్యకలాపాలలో పాల్గొంటున్నట్లు గుర్తించిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.అక్రమ వ్యవస్థలను పూర్తిగా నిర్మూలించాలన్నారు.పోలీసు అధికారులు తమ పరిధిలో ఐపీఎల్ బెట్టింగ్, జూదం, మట్కా వంటి అక్రమ కార్యకలాపాల వల్ల కలిగే నష్టాలను వివరించాలన్నారు.ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.ప్రజలు కూడా ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎక్కడైనా అక్రమ బెట్టింగ్ లేదా జూదం లేదా మట్కా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కర్నూల్ కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9121101100కు జిల్లా ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని కర్నూల్ ఎస్పీ తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడడం పోలీసుల ముఖ్య బాధ్యత అని, అందులో భాగంగా ఇటువంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టడం అత్యంత అవసరమని కర్నూలు ఎస్పీ తెలిపారు. పోలీసు అధికారులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, జిల్లాలో నేరాలను పూర్తిగా నియంత్రించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న కర్నూలు పోలీసులు











### చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి.

కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ :కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు ఆది వారం కౌన్సిలింగ్ నిర్వహించారు.సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

## వివాహ శుభకార్యాలకు ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన కాటసాని దంపతులు









కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ :నంద్యాల జిల్లా బనగానపల్లె లో ఉన్న బి వి ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ నందు అవుకు మండలం, రాఘవరాజపురం (పెద్ద కొట్టాల) గ్రామానికి చెందిన మునగల భాస్కర్ రెడ్డి కుమారుడు శ్రీకాంత్ రెడ్డి - బాలభారతి ల వివాహానికి కాటసాని దంపతులు వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆయన సతీమణి కాటసాని ఉమా మహేశ్వరమ్మ ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.అనంతరం ఓర్వకల్లు మండలం శ్రీశ్రీశ్రీ కొమ్మ చెరువు ఆంజనేయ స్వామి దేవస్థానం నందు గుడుంబై తాండ గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు మద్దిలేటి నాయక్ సోదరుడు రమణ నాయక్ – ఆదిలక్ష్మి ల వివాహానికి కాటసాని దంపతులు నంద్యాల జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆయన సతీమణి ఉమామహేశ్వరమ్మ ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మానవత్వాన్ని చాటుకున్న డాక్టర్. శంకర్ శర్మ





కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ :ధనవంతులు పేదలకు సహాయం చేయడం సమాజానికి ఎంతో ముఖ్యమని కర్నూలు కు చెందిన ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు శంకర్ శర్మ తెలిపారు. గాయత్రీ ఎస్టేట్ లోని గురుదత్త పాలీక్లినిక్ లో డాక్టర్. శంకర్ శర్మ పేద వృద్ధులకు సహాయం చేశారు. బుధవార పేటకు చెందిన ఆదరణ డే కేర్ సెంటర్ కు చెందిన 50 మంది వృద్ధులకు డాక్టర్. శంకర్ శర్మ గొడుగులు, పాదరక్షలు అందజేశారు. ప్రస్తుతం ఎండాకాలం ఎక్కువగా ఉన్నందున చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉదయం11 గంటల తర్వాత మధ్యాహ్నం 3 గంటల లోపు అత్యవసరం అయితే తప్ప బయటకు రాకూడదన్నారు. మంచి నీరు, చల్లని పానియాలతో పాటు రాగి జావా తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం యుద్ధం కారణంగా నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి పేదలపై భారం పడినందున వృద్ధులకు తనవంతు సహాయం చేశానని డాక్టర్. శంకర్ శర్మ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆదరణ నిర్వాహకులు రంజిత్ పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన వివాహ వేడుక ప్రముఖుల సమక్షంలో నూతన దంపతులకు ఆశీస్సులు



ఆస్పరి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ : ఆస్పరి మండలం ఐటీడీపీ అధ్యక్షులు వీరేష్ గారి కుమార్తె వివాహం ఎంతో వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి పారిశ్రామికవేత్త ఎన్‌డీబీఎల్ లక్ష్మీనారాయణ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి, నూతన దంపతులను హృదయపూర్వకంగా ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, సన్నిహితులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యులు మరియు అతిథుల సందడితో ఈ వేడుక మరింత సంతోషభరితంగా మారింది.


## నూతన వధూవరులను ఆశీర్వదించిన మండల నాయకులు





ఆస్పరి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ : పత్తికొండ మండలం కోతిరాళ్ల గ్రామం నందు నూతన దంప తులను ఆశీర్వదించిన మండల నాయకులు ఆస్పరి మండలం తంగారాడోనా గ్రామం నందు ఉన్న ఐ టీ డీ పీ మండల కన్వీనర్ కే వీరేష్ కూతురు వివాహమునకు విచ్చేసి మండల నాయకులు విచ్చేసి వీరి వివాహ మహోత్సవము మల్లెల మనసుతో సూర్యచంద్రుల సాక్షిగా ముత్యాల పందిరిలో పచ్చని తోరణాల మధ్య మంగళ వాయిద్యాలసందట్లో వేదమంత్రాల సాక్షిగా మూడుముళ్ల బంధంతో దంపతులను ఆశీర్వదించడం జరిగింది వీరిపై ఎల్లప్పుడూ చల్లని దీవెనలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకొని ఈ కార్యక్రమంలో ఆస్పరి మండలం కన్వీనర్ కురువ గోవిందప్ప,మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్,ఆస్పరి సొసైటీ డైరెక్టర్ ముత్తుకూరు మల్లికార్జున, బి స్ న్ ల్ టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్ బత్తిని జీవన్ కుమార్, మార్కెట్ యాడ్ చైర్మన్ వెంకటేశ్వర్లు,తంగారదోన గ్రామం మాజీ సర్పంచ్ జి గోపాల్ రెడ్డి, రిటైర్డ్ విఆర్వో సీతారామరెడ్డి, టిడిపి సీనియర్ నాయకుడు కృష్ణమూర్తి,కే రంగముని, జర్నలిస్టు బోయ శ్రీనివాసులు, గ్రామ ఎంపీటీసీ జీ నరసన్న,ఆ గ్రామ వీఆర్వో రామాంజనేయులు, రంగారెడ్డి, ఎల్ఐసి అతిఫ్, గొల్ల శ్రీనివాసులు, వీఆర్ఏ తలారి నల్లారెడ్డి

## మట్టిలో మాణిక్యం



ఆస్పరి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ : ఆస్పరి మండలం తంగారాడోనా గ్రామం నందు నివసిస్తున్న కురువ మునిస్వామి కుమారుడు కురువ విశ్వనాథ్ గత నెలల క్రితం జిడిఎస్ పోస్టల్ లో అప్లై చేశాడు ఈ మధ్యకాలంలో రిజల్ట్ రావడంతో ఎంతో సంతోషాన్ని తమ కుటుంబంలో నెలకొని ఉందని కురువ విశ్వనాథ్ కొనియాడారు గ్రామం తరఫు నుంచి ఆయనకు శాలువతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఐ టిడిపి మండల కన్వీనర్ కే వీరేష్, పింజరి బాబు, కురువ పాండురంగ, కురువ బైటంటి బాలముని, కురువ సూరి, ఉల్లిగడ్డల వీరేష్, గొల్ల వినోద్, గొంగల నవీన్, చాకలి పురుషోత్తం,పాల్గొన్నారు

యువతరం న్యూ.స్
The Voice of youth
సోమవారం 13-04-2026

# వేణు దత్త సువర్ణ లక్ష్మి దాంపత్య వ్రతం

**50 మంది దంపతులు మంగళప్రదమైన కంకణాలు కట్టుకుని పూజలు చేశారు**

**ఆగస్టు మాసంలో విశాఖలో స్వామివారి ఆశీస్సులతో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం**

**తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహణ**





ఉత్తరాంధ్ర ప్రతినిధి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ : పాత వెంకోజీపాలెం – హెచ్ బీ కాలనీ రోడ్ లో ఉన్న ఎంవివి ప్రెసిడెన్సీ ఆడిటోరియంలో.. ఆదివారం.. వేణు దత్త సువర్ణ లక్ష్మి దాంపత్య వ్రతం నిర్వహించారు. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ – రాధిక దంపతుల ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో పాటు, బిజెపి అగ్రశ్రేణి నాయకుడు మురళీ మనోహర్ జోషి లాంటి ఎందరో ప్రముఖులు ఆశీర్వాదాలు పొందిన భగవాన్ రామదత్త వద్ద శిష్యరికం చేసిన ముగ్గురు గొప్ప వ్యక్తులతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రజలందరూ క్షేమంగా ఉండాలనే మంచి సంకల్పం కూడా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. తమ దంపతులతో పాటు 50 మంది దంపతులు మంగళప్రదమైన కంకణాలు కట్టుకుని పూజలు చేశారన్నారు. ఇదిలా ఉండగా మే10వ తేదీన హైదరాబాదులోని జడ్చర్ల వద్ద అవదూత భగవాన్ రామదూత స్వామి.. తన తపస్సును భక్తులకు ధారా దత్తం చేస్తారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొనే వారికి అన్ని కష్టాలు అడ్డంకులు తొలగిపోతాయని పేర్కొన్నారు. జడ్చర్లలో అవదూత స్వామివారి ఆశీస్సులను పొందాలని భావించేవారు తనను సంప్రదించాలన్నారు. అంతేకాకుండా ఆగస్టు మాసంలో విశాఖలో స్వామివారి ఆశీస్సులతో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

# చేతులు జోడించి మోకాళ్లపై నిరసన లేట్ డెత్ సర్టిఫికెట్ల కోసం గిరిజనుల వేదన"



ఉత్తరాంధ్ర ప్రతినిధి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ : అనంతగిరి మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా లేట్ డెత్ సర్టిఫికెట్ల జారీ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతుండటంతో గిరిజన గ్రామస్తులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. బూరిగ, చిన్న కోయిల కొండ శిఖర ప్రాంతాలకు చెందిన గ్రామస్తులు "చేతులు జోడించి, మోకాళ్లపై నిల్చుని" తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రొంపిల్లి పంచాయతీ పరిధిలోని ఈ గిరిజన గ్రామాల్లో సుమారు 70 కుటుంబాలు నివసిస్తున్నాయి. గత ఒక సంవత్సరంగా 18 మంది మృతుల లేట్ డెత్ సర్టిఫికెట్ల కోసం గ్రామస్తులు రొంపిల్లి స్వర్ణ సచివాలయంలో దరఖాస్తులు సమర్పిస్తూ వస్తున్నారు. అయితే, ఆ దరఖాస్తులు పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయానికి పంపుతున్నామని చెప్పినా, ఇప్పటివరకు ఒక్క సర్టిఫికెట్ కూడా జారీ కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామస్తుల ప్రకారం, సబ్ కలెక్టర్ పోస్టు ఖాళీగా ఉండటం వల్ల డెత్ సర్టిఫికెట్లు సహా పలు సేవలు ఆలస్యమవుతున్నాయి. స్థానిక రెవెన్యూ అధికారులు పాడేరు ఆర్డీవో కార్యాలయానికి ఫైళ్లు పంపించామని చెప్పగా, ఆర్డీవో కార్యాలయంలో మాత్రం ఫైళ్లు అందలేదని తెలిపినట్టు గ్రామస్తులు పేర్కొన్నారు.దూరప్రాంతంలో ఉన్న ఈ గ్రామాల ప్రజలు సచివాలయానికి చేరుకోవాలంటే 12 కిలోమీటర్లు, అనంతగిరి మండల కేంద్రానికి 70 కిలోమీటర్లు, పాడేరు కేంద్రానికి 150 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. డిజిటల్ సేవలపై అవగాహన పెరిగిన తర్వాతే డెత్ సర్టిఫికెట్లు, లీగల్ హెయిర్ సర్టిఫికెట్లు అవసరమని తెలుసుకున్నామని వారు తెలిపారు.భర్త మరణించిన తర్వాత ఆస్తి హక్కులు భార్యకు రావాలంటే డెత్ మరియు లీగల్ హెయిర్ సర్టిఫికెట్లు అవసరమని తెలిసినా, అవి అందకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు తెలిపారు.ఇప్పటికైనా స్వర్ణ పంచాయతీ ద్వారా సమర్పించిన దరఖాస్తులపై జాయింట్ కలెక్టర్ స్వయంగా విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బూరిగ గ్రామం నుంచి అనంతగిరి మండల రెవెన్యూ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ నిరసనలో మాజీ వార్డు సభ్యుడు సోముల అప్పలరాజు, గిరిజన రైతు సంఘం నాయకుడు వనపర్తి సింహాచలం, బద్నాని కొత్తమ్మ, సోముల ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఏడాది పాటు తిరుగుతున్న గిరిజనులకు ఇంకా న్యాయం జరగకపోవడం ప్రభుత్వ యంత్రాంగంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

# భౌతిక మానసిక వ్యాయామాలే నాడీ వ్యవస్థకు దివ్య ఔషదాలు




**ప్రాధమిక దశలో వ్యాధిని గుర్తించి మందులను వాడితే నివారణ సాధ్యం**

**పార్కిన్సన్స్ (వణుకుడు వ్యాధి)అవగాహనా సదస్సులో.ప్రముఖ న్యూరాలజిస్ట్డా. బి.దేముడు బాబు**






ఉత్తరాంధ్ర ప్రతినిధి , ఏప్రిల్, 12యువతరం న్యూస్ : నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచెయ్యడానికి, మానసిక ఒత్తిడిని జయించడానికి నడకను నిత్య వ్యాయామంగా మలచు కోవాలని, యోగ ధ్యానాదులను అభ్యసించడం ద్వారా వణుకుడు వ్యాధికి దివ్యౌషదంగా అవి ఉపకరిస్తాయని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బి.దేముడుబాబు పేర్కొన్నారు. సీషోర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు కె. విజయానంద్ , కార్యదర్శి ఎం ఎస్ నాయుడు , కోశాధికారి పూసపాటి లక్ష్మిరాజు ఉడాపార్క్ లో "పార్కిన్సన్స్ డే" (వణుకుడు)వ్యాధి" పై ఆదివారం నిర్వహించిన 'అవగాహనా సదస్సు'లో డా.దేముడుబాబు ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. అరవై ఏళ్ల వయసు పైబడిన కొందరిలో మాత్రమే నాడీ కణాలు మెదడను దెబ్బతీయడం జరుగుతుందని, 'న్యూరోట్రాన్స్మిటర్' డోపామైన్ పనిచేయక పోవడం మూలంగానే పార్కిన్సన్స్ వ్యాధి (వణుకుడు వ్యాధి) వస్తుందని, చేతులు,కాళ్ళ,దవడలలో వణుకు రావడం, కండరాల బిగదీయడం. పట్టేయడం, చేపట్టిన పనివేగంలో తగ్గుదల, స్నానం,తినడం వంటి అతి సాధారణ కార్యకలాపాలను కూడా ఆలస్యం చేస్తారని , నిరాశ నిస్పృహాలు, భయము, వ్యక్తియొక్క మాటల్ని, చేతివ్రాతను కూడా దెబ్బతీయడం ఈ వ్యాధి యొక్క ప్రాధమిక లక్షణాలన్నారు. ప్రారంభ దశలోనే వ్యాధి గుర్తించి, వైద్యులు సూచించిన మందులను వాడుతూ, నిత్య వ్యాయామం, కేర్ గివర్ సపోర్ట్ తో వ్యాధి బాదితులు మామూలు జీవితాన్ని పొందవచ్చన్నారు. శ్రోతలు అడిగిన అనేక సందేహాలని ఆయన నివృత్తి చేశారు.ఈ సభలో 'వాకర్స్ హెల్త్ క్లబ్' అధ్యక్షులు సి హెచ్. శ్రీనివాసరాజు మాట్లాడుతూ సకాలంలో స్పందించి, ఆపదలో ఉన్నవారిని ఆదుకొనే స్వభావాన్ని ప్రతి ఒక్కరూ మానవత్వంగా మలచు కోవాలని,వాకర్స్ క్లబ్స్ నిర్వహిస్తున్న అనేక ఉచిత వైద్య ,ఆరోగ్య అవగాహనా శిబిరాలలో ఎంతోమంది లబ్ది పొందుతున్నారని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిధులను, సీషోర్ వాకర్స్ వ్యవస్థా పక అధ్యక్షులు డా. పెదసోములు, ప్రతినిధి కె ఎస్ సాయిప్రసాద్, సిప్లా కో–ఆర్డినేటర్ బి.కొండబాబు, గిరిజ మామిడి తదితరులను సీషోర్ క్లబ్ అధ్యక్షులు విజయానంద్ జ్ఞాపికలను అందజేస్తూ, శాలువాలతో ఘణంగా సత్కరించారు

# లింగాలలో మెరుగైన ఫలితాలు









విద్యార్థుల కృషి అభినందనీయం : ఎంఈవో లింగాల ఏప్రిల్ 12 యువతరం న్యూస్ : ఇంటర్మీడియట్ ఫలితాల్లో లింగాల మండలానికి చెందిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ సెకండియర్ బైపీసీ గ్రూప్ 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ సెకండియర్ ఎంపీసీ గ్రూప్‌లో సాయికుమార్ 1000 మార్కులకు గాను 894 మార్కులు సాధించగా, అభిలాష్ సీనియర్ ఇంటర్‌లో 891/1000 మార్కులు, సుధాకర్ ఇంటర్ సెకండియర్ బైపీసీ గ్రూప్‌లో 930/1000 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. అదేవిధంగా కేజీబీవీలో ఇంటర్ సెకండియర్ ఎంపీసీ గ్రూప్‌లో లోకేశ్వరి 929/1000 మార్కులు సాధించగా, బైపీసీ గ్రూప్‌లో కీర్తన 881/1000 మార్కులు సాధించింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ గ్రూప్‌లో తేజ 470కు గాను 445 మార్కులు, బైపీసీ గ్రూప్‌లో నందిని 424/470 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శారద తెలిపారు. ఎంఈఓ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలలో అందుతున్న నాణ్యమైన విద్యతో విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో కృషి చేసి మరింత ఉన్నత ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అధ్యాపకులు, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకొని ముందుకు సాగాలని, సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని ఆకాంక్షించారు. మెరుగైన ఫలితాలు సాధించినందుకు గురుకుల ప్రిన్సిపాల్ శ్రీను, కేజీబీవీ ప్రిన్సిపాల్ శారద, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# జిల్లాలో ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కార్యక్రమం..

ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి కే. పెద్దన్న...





బుక్కరాయసముద్రం ఏప్రిల్ 12 యువతరం న్యూస్ :- బుక్కరాయసముద్రం మండలంలో ప్రకృతి వ్యవసాయం పై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. సీటీ డఐఓ డి పి ఎం శ్రీ లక్ష్మా నాయక్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టబడింది.ఈ కార్యక్రమం రైతు భాగ్యలక్ష్మి కుమారుడు టి – ఐ సి ఆర్ పి శ్రీ ప్రదీప్ పొలంలో జరిగింది. రంగస్వామి (దేశీ ఫెసిలిటేటర్) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో భాగంగా బుక్కరాయసముద్రం మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కే .పెద్దన్న మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం రైతులకు ఆర్థికంగా లాభదాయకమని వివరించారు. రసాయన ఎరువుల ఖర్చులను తగ్గించి, స్థానికంగా లభించే వనరులతో పంటలను సాగు చేయడం ద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందవచ్చని తెలిపారు. అలాగే జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం వంటి పద్ధతులను రైతులు అనుసరించాలని సూచించారు.ఈ సందర్భంగా రంగస్వామి సర్ (దేశీ ఫెసిలిటేటర్) మాట్లాడుతూ, రసాయన ఎరువులు మరియు పురుగుమందుల అధిక వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారం పెరుగుతుందని, పంటల నాణ్యత మెరుగుపడుతుందని చెప్పారు.డాక్టర్ నవీన్ ( ఎస్ పి ఎం ) మరియు బుక్కరాయసముద్రం మండల సిబ్బంది ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఎరువుల డీలర్లు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయం పై మంచి అవగాహన కలిగి, సుస్థిర వ్యవసాయం వైపు ముందడుగు పడింది.

# 13న పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహణ

**కలెక్టర్ విజయకృష్ణన్**



అనకాపల్లి ప్రతినిధి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ : అనకాపల్లి: 13న పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహణఅనకాపల్లి జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌లను ఏప్రిల్ 13 సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. అర్జీల స్థితిని తెలుసుకోవడానికి 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చని సూచించారు. హాజరు కాలేని వారు 'మీకోసం' వెబ్‌సైట్ ద్వారా కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.

# ప్రశాంతంగా ఆరో తరగతి ప్రవేశ పరీక్ష



అనకాపల్లి ప్రతినిధి ఏప్రిల్ 12 యువత రమేష్ :: అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం ప్రశాంతంగా ఆరో తరగతి ప్రవేశ పరీక్ష అనకాపల్లి జిల్లా చీడికాడ మండలం మంచాల ఏపీ ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ పరీక్ష నిర్వహించారు. ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్షలో 100 సీట్లకు మార్కులు, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఫలితాలు వారం రోజుల్లో విడుదల చేయనున్నారు. జిల్లాలోని ఐదు ఆదర్శ పాఠశాలల్లో ఈ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు.

## సేవాభావంతో ముందుకు

# శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ



లింగాల ఏప్రిల్ 12 యువతరం న్యూస్ : లింగాల మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఉత్సవాల్లో భాగంగా కొనసాగుతున్న వారాంతపు సంతలో శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భక్తులు, వ్యాపారస్తులకు మంచినీటి పంపిణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా భారీగా భక్తులు తరలివస్తుండటంతో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. సంతలో పాల్గొన్న వ్యాపారులు, భక్తులకు చల్లని తాగునీరు అందిస్తూ సేవా భావాన్ని చాటారు. ఈ సందర్భంగా భక్తులు సేవా సంస్థ సభ్యులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## విజయనగరం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల వేదిక



విజయనగరం ప్రతినిది ఏప్రిల్ 12 యువతరం న్యూస్: విజయనగరంలో కలెక్టరేట్‌లో ఈ రోజు"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" నిర్వహించనున్నట్లు కలెక్టర్ రామసుందర్ రెడ్డి తెలిపారు. ఈ వేదిక సోమవారం ఉదయం 10 గంటలకు ఆడిటోరియంలో జరుగుతుంది. భూ సమస్యల కోసం ప్రత్యేకంగా 'రెవెన్యూ క్లినిక్' కూడా ఏర్పాటు చేస్తారు. కలెక్టరేట్‌కు రాలేని వారు 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా ఎవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ సూచించారు.

## టూవెల్‌హబ్‌గా భోగాపురం విమానాశ్రయం



విజయనగరం ప్రతినిది ఏప్రిల్ 12 యువతరం న్యూస్:భోగాపురం విమానాశ్రయాన్ని అంతర్జాతీయ స్థాయిలో ట్రావెల్‌హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు కేంద్ర బిందువుగా ఉన్న ఈ విమానాశ్రయాన్ని పూర్తిస్థాయి డిఫెన్స్ ఎయిర్‌పోర్టుగా మారుస్తుండటంతో అన్ని రాకపోకలు భోగాపురం విమానాశ్రయం నుంచే జరిపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. విమానాశ్రయం యొక్క ప్రధాన లక్ష్యం ట్రావెల్‌హబ్ అభివృద్ధి మరియు డిఫెన్స్ ఎయిర్‌పోర్టుగా మార్చడం.

## నెల్లిమర్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.




విజయనగరం ప్రతినిది ఏప్రిల్ 12 యువతరం న్యూస్:నెల్లిమర్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. విద్య, మౌలిక సదుపాయాల కల్పననే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. ఆదివారం పతివాడ పంచాయతీలో పర్యటించారు. వామీ కంపెనీ నిధుల సహకారంతో నిర్మించనున్న నూతన పాఠశాల భవనానికి ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్ అప్రోచ్ రోడ్డు, శ్మశాన వాటిక అప్రోచ్ రోడ్డు ప్రారంభించారు.


## నేడు రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్‌లో పిజిఆర్‌ఎస్ కార్యక్రమం



రేపల్లె, ఏప్రిల్ 12, యువతరం న్యూస్: బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పిజిఆర్ ఎస్) కార్యక్రమాన్ని ఈసారి రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీ బి. ఉమామహేశ్వర్, ఐపిఎస్ తెలిపారు. సాధారణంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ మార్పు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 13, సోమవారం నాడు రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్‌లో పిజిఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. రేపల్లె పట్టణం మరియు పరిసర ప్రాంతాల ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నేరుగా ఎస్పీ గారికి తెలియజేసేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అలాగే, సాధారణంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి రావాలనుకునే వారు ఈ మార్పును గమనించి, సోమవారం నాడు రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్‌కు హాజరుకావాలని కోరారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఎస్పీ స్పష్టం చేశారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న కోట్ల హరి చక్రపాణి రెడ్డి..





దేవనకొండ ఏప్రిల్ 12 యువతరం న్యూస్ : దేవనకొండ మండలం నేలతలమారి, గుమ్మరళ్ల, బి సెంటర్, తదితర గ్రామాలలో పలు వివాహాలకు వైసిపి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు కోట్ల హరి చక్రపాణి రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. వివాహ జీవితం సుఖశాంతులతో నిండాలని, భగవంతుని ఆశీస్సులతో సంతోషంగా జీవించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాలంటీర్ వింగ్ సంయుక్త కార్యదర్శి కప్పట్రాళ్ల దివాకర్ నాయుడు, స్థానిక నాయకులు కూడా పాల్గొన్నారు.

# ప్రభుత్వమే వలసవాదుల్ని అరికట్టాలి

**రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ**

**షెడ్యూల్ ఏరియాలోకి విపరీతంగా వలసలు పెరుగుతున్నాయని వలసలను అరికట్టే బాధ్యత ప్రభుత్వానిదేరాష్ట్ర అధ్యక్షులు పాయం**



ములుగు ప్రతినిధి ఏప్రిల్ 12 యువతరం న్యూస్ : ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో ఆదివారం నాడు ఆర్ అండ్ గెస్ట్ హౌస్ బంగ్లా ఆవరణలో ములుగు జిల్లా అధ్యక్షులు పూణే ప్రతాప్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గొండ్వానాసంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ దొర మాట్లాడుతూ 1980 ముందున్న ఏజెన్సీ ప్రాంతాలు ఇప్పుడున్న ఏజెన్సీ ప్రాంతాలు ఏజెన్సీ ప్రాంతాలుగా కనబడటం లేదని మొత్తం వలస వాదులతో షెడ్యూల్ ఏరియా మొత్తం నిండిపోతుందని ఈ యొక్క వలసలను కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా (ఐటీడీఏ ) ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ బాధ్యత పి ఓ లు తీసుకోని అరికట్టాలని సూచించారు ట్రైబల్ డెవలప్మెంట్ కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే ఐ టీ డి ఏ . పి ఓ లు ఏజెన్సీలో కొన్ని గ్రామాలలో ఇంకా రోడ్లు మౌలిక సదుపాయాలు పూరి గుడిసెలోనే జీవనం కొనసాగిస్తున్న ఆదివాసుల జీవన విధానాన్ని ఇప్పటివరకు ఐటీడీఏలు గుర్తించకపోవడం సోషనీయం పాలక ప్రభుత్వం గొప్పలుగా చెప్పుకునే ఇందిరమ్మ రాజ్యం మరియు పదే పదే గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వందివంగత రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ ఆయములో . షెడ్యూల్ ప్రాంతాల ఆదివాసీల భూముల పై అన్యాక్రాంతం ఆయన 98% భూములను కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులు షెడ్యూల్ ఏరియాలలో పర్యటించి నివేదిక ఇవ్వాలని కమిటీని ఏర్పాటు చేసి కమిటీ ఏజెన్సీలో పర్యటించి నివేదిక అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇచ్చినప్పటికీ ఆ నివేదిక లను ఇప్పటివరకు దాన్ని బయటకు తీయకుండా నిర్లక్ష్యం చేస్తున్న ఇప్పటి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆదివాసులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చట్టశీచట్టం ప్రకారంగా జిల్లా కలెక్టర్ గాని ఐ టి డి ఏ. పి ఓ లు ఎందుకు పనిచేయడం లేదని ఆరోపించారు,సారవంతమైన ఆదివాసుల భూములు గిరిజనేతరుల చేతులోకి వెళ్లిపోయాయని,కొద్దో గొప్ప ఉన్న ఆదివాసీ భూములను కెసిఆర్ గద్దెనెక్కి దరిద్రపు ధరణిని తీసుకొచ్చి ఉన్న భూమిని మొత్తం ధరణి మీ సేవలో వలస గిరినేతరుల కదంబ హస్తాల్లోకి పట్టా రూపంలో వెళ్లిపోయారని ఆరోపించారు,ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పూణేం సాయి పాల్గొన్నారు.

# ఏప్రిల్ 17 18 19 తేదీల్లో నంద్యాలలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఆర్ నరసింహులు పిలుపు



కర్నూల్ ప్రతినిధి ఏప్రిల్ 12 యువతరం న్యూస్: సిఐటియు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు 17వ రాష్ట్ర మహాసభలు నంద్యాలలో 17,18,19తేదీల్లోజరుగుతున్నాయి. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లారీ హమాలి యూనియన్,షరీఫ్ నగర్ ఐటిసి హమాలి యూనియన్ల విస్తృతస్థాయి సమావేశాలు జరిగాయి. సిఐటియు మార్కెట్ యార్డ్ యూనియన్ అధ్యక్షులు ఎం వెంకటేశ్వర్లు షరీఫ్ నగర్ హమాలి యూనియన్ కార్యదర్శి రాజు లు సమావేశాలకు అధ్యక్షతవహించారు. సమావేశాలకు ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఆర్. నరసింహులు నగర అధ్యక్షులు వై నగేష్ మార్కెట్ యార్డ్ గౌరవ అధ్యక్షులు టి. రాముడు నగర ఉపాధ్యక్షులు కే. సుధాకరప్ప లు సమావేశానికి విచ్చేసిన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి కార్మికుల హక్కులు హరించాలని ఏప్రిల్ ఒకటి నుండి అమలు చేస్తామని జీవోను విడుదల చేసింది. 40 రోజుల వరకు అభ్యంతరాలు తెలియజేయాలని గడువు విధించింది. ఇప్పటికే సిఐటియు ఇతర కార్మిక సంఘాలన్నీ కూడా కలిసి పెద్ద ఎత్తున పోరాటం చేసి లేబర్ కోడ్లను అమలు చేయవద్దని ఉద్యమాలు పోరాటాలు చేస్తుంటే పట్టించుకోకుండా లేబర్ కోడ్ అమలు చేయాలని జీవో విడుదల చేయడం చాలా దుర్మార్గం అన్నారు. కార్మిక వర్గానికి వ్యతిరేకంగా కార్పొరేట్ శక్తులకు పెట్టుబడి దారులకు అనుకూలంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి అనేది అర్థమవుతుందని పెట్టుబడి దారులకు 30 లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇచ్చి కార్మిక వర్గం యొక్క సంక్షేమం గురించి మాట్లాడితే మొండి చేయి చూపిస్తున్నారు. ఇంతకంటే నిరంకుశ పాలన ఇంకొకటి ఉండదు అన్నారు. ఫిబ్రవరి 12వ తేది చేసినటువంటి దేశవ్యాప్త సమ్మెలో 40 కోట్ల మంది కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని తమ యొక్క నిరసన తెలియజేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దున్నపోతు మీద వాన పడిన చందంగా మొండిగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా సామ్రాజ్య వాదకాంక్షతో ఆ దేశాల యొక్క సంపదను దోచుకోవడం కోసం వేలాదిమంది చిన్నపిల్లలు మహిళలు పౌరుల ప్రాణాలను తీస్తూ నరమేధం చేస్తున్నది దొంగే దొంగ దొంగ అని అరిచినచందంగా అమెరికా ట్రంపువ్యవహరిస్తున్నాడు ఇలాంటి సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేసి పోరాటం వైపు మళ్ళించి ప్రపంచ శాంతిని కాంక్షించాలని కోరారు. కార్మిక వర్గ సమస్యలను చర్చించడం కోసం కార్మికుల జోలికొస్తే ఊరుకోము ఉద్యమిస్తామని తెలియజేయడం కోసం ఏప్రిల్ 17,18,19 తేదీల్లో నంద్యాల జిల్లాలో సిఐటియు 17వ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయి. మహాసభల విజయవంతం కోసం ఏప్రిల్ 17వ తేదీన ఉదయం 10 గంటలకు టేక్కే మార్కెట్ నుండి మున్సిపల్ టౌన్ హాల్ వరకు కార్మిక వర్గం పెద్దమహా ర్యాలీ 11 గంటలకు మున్సిపల్ టౌన్ హాల్లో భారీ బహిరంగ సభ నిర్వహించ బోతున్నము ఈ ర్యాలీలో కార్మిక వర్గం వేలాదిగా కదలి వచ్చి పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు నగర నాయకులు జి ఏసు యూనియన్ నాయకులు రామకృష్ణ, కేశవ, రంగన్న, రాజు, మధు, నాగేంద్ర, సుబ్బారెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం




రేపల్లెలో 33 మందికి సీఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ.

రేపల్లె, ఏప్రిల్ 12, యువతరం న్యూస్: రేపల్లె నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎం ఆర్ ఎఫ్) నుండి ఆర్థిక సహాయం మంజూరు చేశారు. ఈ మేరకు మొత్తం రూ. 32,82,393 విలువైన సీఎ ఎఫ్ చెక్కులను 33 మంది లబ్ధిదారులకు మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అవసరమైన వారికి తక్షణ సాయం అందుతున్నదని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఇలాంటి పథకాలను వినియోగించుకుని ఉపశమనం పొందాలని సూచించారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వంక ఆక్రమణ చోద్యం చూస్తున్న అధికారులు

**అధికారుల తీరు పట్ల అనుమానం వ్యక్తం చేస్తున్న ప్రజలు**

**వంక ఆక్రమణదారులకు ఇళ్ల పట్టాలు....**






వెల్దుర్తి ఏప్రిల్ 12 యువతరం న్యూస్: మండల కేంద్రమైన వెల్దుర్తి లో వంకలు ఆక్రమణలకు గురవుతున్నాయని వెల్దుర్తి పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వంకలు ఆక్రమణ కారణంగా కుంచించుకుపోతున్నాయి. దీంతో వరదలు వస్తే వరద నీరు గ్రామంలోనికి వచ్చే అవకాశం ఉందని వెల్దుర్తి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంకలో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొద్దిమంది నాయకులు ఆక్రమణ దారుల వద్ద డబ్బులు తీసుకొని సహకరించారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొద్దిమంది వంక ఆక్రమణదారులకు ఇళ్ల పట్టాలు సైతం ఉన్నట్లు ప్రజలు గుసగుసలాడుతున్నారు. వంకలో ఇల్లు నిర్మాణాలు చేపట్టిన వారికి ఇళ్ల పట్టాలు ఎలా వచ్చాయి అనేది ప్రశ్న. జిల్లా అధికారులు వంకలో నిర్మాణాలు చేపట్టిన వారిని ప్రశ్నిస్తే నిజాలు బయటికి వస్తాయని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు ఇలాగే చూస్తూ ఊరుకుంటే వంక మొత్తం అక్రమ నిర్మాణాలతో నిండిపోతుందని పట్టణ ప్రజల ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు కల్పించుకొని అక్రమ నిర్మాణాలపై తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు వేడుకుంటున్నారు.

# నమ్మరు గానీ నల్ల శనగలను ఇలా తింటే లెక్కలెనన్నీ లాభాలు తెలుసా..? నిపుణులు ఏం చెబుతున్నారంటే..







నల్ల శనగలు తినడం వల్ల కలిగే అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాల గురించి మీరందరూ బహుశా విని ఉంటారు లేదా చదివి ఉంటారు. నల్ల శనగలు ఇనుము, ఇతర పోషకాలకు సాటిలేని మూలం. ఇవి ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. నల్ల శనగలను తరచుగా కూరగా లేదా ఉడకబెట్టి తింటారు. నానబెట్టిన శనగలు తీసుకోవడం వల్ల ఇంకా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని మీకు తెలుసా..? ఉదయం పూట నానబెట్టిన శనగలు తినడం వల్ల లెక్కలేనన్ని ప్రయోజనాలు ఉన్నాయని అనేక పరిశోధనలు చెబుతున్నాయి. నానబెట్టిన శనగలు ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులకు గొప్ప మూలం. నానబెట్టిన నల్లశనగలు ఒక వంద గ్రాములు తింటే శక్తి పెరిగి జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. కండరాలు బలంగా మారుతాయి. ఆ రోజంతా మంచి ఎనర్జీతో ఉత్సాహంగా ఉంటారు. నానబెట్టిన శనగలు ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులకు గొప్ప మూలం. నానబెట్టిన నల్లశనగలు ఒక వంద గ్రాములు తింటే శక్తి పెరిగి జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. కండరాలు బలంగా మారుతాయి. ఆ రోజంతా మంచి ఎనర్జీతో ఉత్సాహంగా ఉంటారు.

1 / 5

నానబెట్టిన శనగలు ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులకు అత్యంత గొప్ప మూలం. అలాంటి నల్ల శనగలను నానబెట్టడం వల్ల అందులోని ప్రోటీన్లు, విటమిన్లు, ఇతర పోషకాల నాణ్యత మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. పైగా అవి సులభంగా జీర్ణమవుతాయి. ప్రతిరోజూ ఒక గుప్పెడు నానబెట్టిన నల్ల శనగలు తినడం వల్ల బోలెడు లాభాలు ఉన్నాయి.

2 / 5

అధిక బరువు, శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌తో ఇబ్బంది పడుతున్న వారికి నల్ల శనగలు చాలా మంచిది. త్వరగా సన్న బడటానికి, అధిక బరువుతో పాటు కొలెస్ట్రాల్ తగ్గడానికి నానబెట్టిన నల్ల శనగలు ఎంతగానో దోహదపడతాయి.

## సూర్యగ్రహణంలో రింగ్ ఆఫ్ ఫైర్ అంటే ఏమిటి? భారతీయులు ఈ అరుదైన దృశ్యాన్ని చూడగలరా.. తెలుసుకోండి



భూమి, సూర్యుని మధ్య చంద్రుడు వెళ్ళినప్పుడు సూర్య గ్రహణం ఏర్పడుతుంది. ఈ సమయంలో సూర్యుడు పూర్తిగా కానీ పాక్షికంగా కానీ భూమికి కనిపించదు. ఈ ఖగోళ ఘటనను సూర్యగ్రహణం అని అంటారు. ఈ ఏడాది(2024) రెండో సూర్య గ్రహణం ఏర్పడనుంది. ఈ ఏడాదికి ఇదే చివరి సూర్యగ్రహణం కూడా. సూర్యగ్రహణం ఏర్పడినప్పుడల్లా ఆకాశంలో కొన్ని అరుదైన దృశ్యాలు కనిపిస్తూనే ఉంటాయి. వీటిలో రింగ్ ఆఫ్ ఫైర్ కూడా ఒకటి. ఈసారి కూడా సూర్యగ్రహణం సమయంలో సూర్యుడు చుట్టూ అగ్ని వలయంలా కనిపించానుంది. ఈ అరుదైన దృశ్యం భారతదేశంలో కూడా కనిపిస్తుందో లేదో తెలుసుకుందాం.

### సూర్యగ్రహణం ఎన్ని రకాలు?

సూర్యగ్రహణం గురించి మాట్లాడుతే మొత్తం 3 రకాలు ఉన్నాయి. మొదటి సూర్యగ్రహణాన్ని సంపూర్ణ సూర్యగ్రహణం అంటారు. సంపూర్ణ సూర్యగ్రహణంలో చంద్రుడు భూమిని పూర్తిగా కప్పేస్తాడు. ఈ సమయంలో చంద్రుడు భూమికి చాలా దగ్గరగా ఉంటాడు. భూమిపై సూర్యుడి వెలుగు పడకుండా చంద్రుడు కప్పెయ్యండతో పూర్తి అంధకారం కమ్ముకుంటుంది.రెండవ గ్రహణాన్ని పాక్షిక సూర్యగ్రహణం అంటారు. ఇందులో చంద్రుడు సూర్యుడిని పూర్తిగా కవర్ చేయడు. చంద్రుడి నీడ సూర్యుడిలోని కొంత భాగాన్ని కప్పి ఉంచితే సూర్యుడి నీడ పాక్షికంగా భూమిపై పడుతుంది. ఈ పరిస్థితిని పాక్షిక సూర్యగ్రహణం అంటారు.ఈ సమయంలో సూర్యుడి కొంత భాగమే కనిపిస్తుంది. మిగతా భాగం నల్లగా ఉంటుంది.

## సుప్రీం కోర్టుకు తిరుమల లడ్డు వివాదం నేడు విచారించనున్న ఉన్నత న్యాయస్థానం



తిరుమల లడ్డు వివాదం మరింత ముదురుతోంది. ఈ లడ్డు కల్తీ వ్యవహారంలో ఒక వైపు సిట్ దూకుడు పెంచగా, మరో వైపు సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు అవుతున్నాయి. లడ్డు కేసులో నిజనిజాలు బయటకు తీయాలని డిమాండ్ పెరుగుతోంది. అటు అధికార పార్టీ కుటమి ప్రభుత్వం, ఇటు వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధాలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉంటే నేడు సుప్రీంకోర్టులో తిరుమల లడ్డు వివాదం కేసు విచారణకు రానుంది. దీనిపై జస్టిస్ బి.ఆర్ గవాయి, కె.వి విశ్వనాథన్ ధర్మాసనం విచారణ జరపనుంది. కోర్టు నంబర్ 3 లో ఐటెం నెంబర్ 63గా తిరుమల లడ్డు కేసు నమోదైంది. తిరుమల లడ్డు ప్రసాద కల్తీ వివాదంలో నిజా నిజాలు నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో కమిటీ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు వైఎస్ఆర్సీపీ ఎంపీ వైవి సుబ్బారెడ్డి.ప్రసాద కల్తీపై చంద్రబాబు వ్యాఖ్యలపై వాస్తవాలు తేల్చేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్య స్వామి పిటిషన్ వేశారు. అంతేకాదు ఈ లడ్డు ప్రసాద కల్తీపై రచయిత విక్రమ్ సంపత్ సహా పలువురు కూడా సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దాఖలు చేసిన పిటిషన్లపై ఉన్నత న్యాయస్థానం విచారణ జరపనుంది.అయితే తిరుమల తిరుపతి దేవస్థానం (%ఋణ%) శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రపంచవ్యాప్తంగా భక్తులున్నారు. నిత్యం కోట్లాది రూపాయలు విలువ చేసే కానుకలు సమర్పిస్తుంటారు భక్తులు. అత్యంత ఆదాయం కలిగిన ఆలయాల్లో తిరుమల మొదటి స్థానంలో ఉంటుంది. వీటన్నింటికీ మించి స్వామివారి 'ప్రసాదం' లడ్డుకు ఎంతో విశిష్టత, ప్రాధాన్యత ఉంది. సామాన్యుడి నుంచి ప్రధాన మంత్రి వరకు ఈ లడ్డు ప్రసాదాన్ని ఇష్టపడుతుంటారు.

## ఈ ఆకులు మాములు మెడిసిన్ కాదు 120 వ్యాధులకు చెక్ కిడ్నీల్లో రాళ్లన్నీ ఖతం



ఉసిరిలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. రోజుకో యాపిల్ తినలేని వారు ఒక ఉసిరి తింటే చాలని పెద్దలు చెబుతూ ఉంటారు., అయితే కాయలు మాత్రమే.. ఉసిరి ఆకులతో కూడా శరీరానికి ఎన్నో బెనిఫిట్స్ ఉన్నాయి. ఎన్నో రకాల వ్యాధుల నయం చేయడంలో ఉసిరి ఆకులు మెడిసిన్‌లా పనిచేస్తాయి. ప్రమాదకర హెపటైటిస్ వంటి వ్యాధులకు కూకు ఉసిరాకుతో చెక్ పెట్టవచ్చు. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే.. మన గట్ హెల్త్ కూడా చాలా బాగుంటుంది. ఉసిరి ఆకులు వగరగా ఉంటాయి. కాస్త తీపి రుచి కూడా మిళితం అయినట్లు ఉంటుంది. ఆయుర్వేదం ప్రకారం మన శరీరంలో 3 రకాల దోషాలు ఉంటాయి. వాత, పిత్త, కఫ. ఈ దోషాలకు విరుగుడు ఉసిరి ఆకు అంటున్నారు ఆయుర్వేద వైద్యులు. ఉసిరి ఆకులు పప్పు వంటి వాటిల్లో వేసుకోవచ్చుట. ఇక పొడిలాగా మార్చి కూడా వినియోగించవచ్చుట. బ్లడ్ డిజార్డర్స్, ఇన్ఫ్లమేషన్, మలేరియా, యూరినరీ ట్రాక్ట్ ఇనెఫెక్షన్ వంటి 120 వ్యాధుల చికిత్సలో ఉసిరి ఆకులు ఉపయోపడతాయని చెబుతున్నారు.ఉసిరి ఆకుల పొడి తీసుకుంటే.. కడుపులో అల్సర్ వంటి సమస్యలు నయమవుతాయట. ఉసిరి ఆకుల్లో ఉండే యాంటీ-ఆక్సిడెంట్, యాంటీ-వైరల్ లక్షణాల వల్ల లివర్ డ్యామేజ్ నుంచి బయటపడొచ్చు. అలానే లివర్ ఫంక్షనింగ్ మెరుగుపడుతుంది. ఉసిరితోని పోషకాలు.. కాలేయ కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి. ఉసిరి ఆకల పొడిని తీసుకోవడం వల్ల దగ్గు, కఫం, జ్వరం వంటి లక్షణాల నుండి రిలీఫ్ ఉంటుంది. ఉసిరి బాడీలోని రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది.అలానే మూత్రపిండాల్లో రాళ్ల సమస్యతో ఇప్పుడు చాలామంది ఇబ్బంది పడుతున్నారు. అలాంటివారు ఉసిరి ఆకుల పొడి తినడం వల్ల చాలా మంచి రిజల్ట్స్ ఉంటాయట. కిడ్నీ వ్యాధుల నుండి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాదు పిత్తాశయ రాళ్ల నివారణలోనూ ఉసిరి ఆకులు ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు తేలింది.

## నేటి యువత ఎందుకు గుండెపోటుకు గురవుతున్నారు ఎలా నివారించాలో నిపుణులు సలహా ఏమిటంటే



జార?ండ్‌లో ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుళ్ల రిక్రూట్‌మెంట్ కోసం రన్నింగ్ టెస్ట్ జరిగింది. ఇందులో పాల్గొన్న చాలా మంది యువకులు రేసులో మరణించారు. పరిగెత్తుతుండగా గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఇలాంటి కేసులు గత కొన్నేళ్లుగా వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ప్రతిరోజూ ఇందుకు సంబంధించిన కొత్త కొత్త కేసులు వెలుగులోకి వస్తూ ఆందోళన కలిగిస్తున్నాయి. పార్టీలో డ్యాన్స్ చేస్తూ కొందరు, జిమ్ చేస్తూ కొందరు గుండెపోటుకు గురవుతున్నారు. ఆడుతూ, పాడుతూ మరణిస్తున్న కేసులన్నీ యువతలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ సంఘటనలు నేటి జనరేషన్ కు ఒక హెచ్చరిక. అటువంటి పరిస్థితిలో ప్రతి ఒక్కరూ తమ హృదయాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. ఈ సంవత్సరం ప్రపంచ హృదయ దినోత్సవం సెప్టెంబర్ 29 న జరుపుకుంటున్నారు. ఈ రోజుని గుండె జబ్బులపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఎంపిక చేశారు. యువత గుండెపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే గుండె ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకోసం గుండె ఆరోగ్యానికి సంబంధించిన ప్రమాదాలను గుర్తించేందుకు ఈసీజీ, సీటీ స్కాన్, యాంజియోగ్రఫీ వంటి టెక్నిక్‌లను ఉపయోగించాల్సిన అవసరం ఉంది.

### గుండెపోటు కేసులు ఎందుకు పెరుగుతున్నాయంటే..?

యువతరంలో మానసిక ఒత్తిడి, చెడు, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా గుండెపోటు, గుండె ఆగిపోవడం, గుండె నొప్పి వంటి కేసులు గణనీయంగా పెరగడానికి ఇవే కారణాలు. అందువల్ల ఏ వయస్సులో ఉన్న వారైనా సరే గుండె ఆరోగ్యాన్ని పర్యవేక్షించుకోవడం ప్రస్తుతం చాలా ముఖ్యం.

## ఆదివారం కూల్చివేతలేంటి చంచల్‌గూడ చర్లపల్లికు పంపిస్తే తెలుస్తుంది హైడ్రాపై హైకోర్టు ఆగ్రహం



నగరంలో ఓ వైపు హైడ్రా కూల్చివేతలు.. మరోవైపు మూసీ నది పరివాహక ప్రాంతంలో ఇళ్లకు మార్కింగ్ ప్రక్రియ తెలంగాణను షేక్ చేస్తున్నాయి.. ఈ క్రమంలో తెలంగాణ హైకోర్టు హైడ్రాపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. హైడ్రాకున్న చట్టబద్ధతను ధర్మాసనం ప్రశ్నించింది. పొలిటికల్ బాసుల కోసం పనిచేస్తే ఇబ్బందుల్లో పడతారని హైకోర్టు అధికారులను హెచ్చరించింది. ఈ సందర్భంగా ఆదివారం కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.. రాజకీయ నేతల కోసం పనిచేస్తే ఇబ్బందుల్లో పడతారని.. చంచల్ గూడ, చర్లపల్లికు పంపిస్తే తెలుస్తుందంటూ హై కోర్ట్ పేర్కొంది.ఇష్టానుసారంగా భవనాలను కూల్చేస్తే జీవో99పై స్టే ఇస్తామంటూ న్యాయస్థానం పేర్కొంది.. ప్రజల నమ్మకాన్ని కోల్పోవద్దన్న హైకోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని హైడ్రా కమిషనర్, అమీన్‌పూర్ తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసింది. హైడ్రా కూల్చివేతలపై సోమవారం విచారణ జరిపింది.. విచారణకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వర్చువల్‌గా హాజరయ్యారు.. విచారణ అనంతరం హైకోర్టు తదుపరి విచారణను అక్టోబర్ 15కు వాయిదా వేసింది. విచారణకు హాజరైన హైడ్రా కమిషనర్‌పై హైకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. తహశీల్దార్ తీరుపై కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. భవనాన్ని 48 గంటల్లో ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చి 40 గంటల్లోపే ఎలా కూల్చుతారంటూ సీరియస్ అయ్యింది. ఆదివారం కూల్చివేతలపై మండిపడిన ధర్మాసనం.. ఇలా చేయడం కరెక్ట్ కాదంటూ పేర్కొంది. వీకెండ్‌లోనే కూల్చివేతలు ఎందుకని హైకోర్టు ప్రశ్నించగా.. అమీన్‌పూర్‌లో కేవలం పరికరాలు మాత్రమే సమకూర్చామని హైడ్రా కమిషనర్ హైకోర్టుకు తెలిపారు. ఆదివారం ఎలా పరికరాలు సమకూరుస్తారు.. ఆదివారం కూల్చడంలో మీ ఉద్దేశం ఏమిటంటూ ధర్మాసనం ప్రశ్నించింది.. రేపు చార్మినార్ తహశీల్దార్ వచ్చి.. చార్మినార్, హైకోర్టును కూల్చడానికి పరికరాలు అడుగుతారు%ా% కూల్చేస్తారా..? అంటూ రంగనాథ్‌ను ప్రశ్నించింది.హైడ్రా అంటే కేవలం కూల్చివేతలు చేయడమేనా.. ప్రజల నమ్మకాన్ని కోల్పోవద్దంటూ హైకోర్టు సూచించింది.. పెద్దలు, పేదల మధ్య వ్యత్యాసాలు చూస్తున్నారా..? మూసీ విషయంలో యాక్షన్ ప్లాన్ ఏమిటి..? అంటూ ప్రశ్నించింది.

## మీకు అర్థమవుతోందా అది కూడా గుండెపోటు లక్షణమే ఆ నొప్పిని లైట్ తీసుకోవొద్దు



ప్రపంచవ్యాప్తంగా గుండెపోటు మరణాలు భారీగా పెరుగుతున్నాయి.. భారతదేశంలో కూడా చిన్నా పెద్దా.. అనే తేడా లేకుండా చాలామంది గుండెపోటుకు గురవుతున్నారు.. అయితే.. గుండె కండరాల భాగానికి తగినంత రక్తం అందనప్పుడు, గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. అయితే.. గుండెపోటుకు ముందు శరీరం మనకు కొన్ని సంకేతాలను అందిస్తుంది.. ఆ లక్షణాలను చాలా మంది విస్మరిస్తుంటారు. అలా విస్మరించడం, నిర్లక్ష్యం చేయడం వల్ల సమస్య మరింత జఠిలం అయి.. ప్రాణాలు తీసే ప్రమాదం పెరుగుతుంది. గుండెపోటు అకస్మాత్తుగా వచ్చి.. 2-3 నిమిషాల్లో నొప్పి వేగంగా పెరుగుతుంది. ఈ నొప్పి కుడి, ఎడమ, ఛాతీ మధ్యలో, దవడ లేదా ఎడమ చేతికి వ్యాపిస్తుంది.అయితే.. ఈ సైలెంట్ కిల్లర్ గుండెపోటు లక్షణాలకు సంబంధించి ఇటీవల ఒక కొత్త అధ్యయనం షాకింగ్ విషయాలను వెల్లడించింది. దీనిలో చెవుల్లో నొప్పి, భారం కూడా గుండెపోటు 'నిశ్శబ్ద' లక్షణాలలో ఇది కూడా కావచ్చని పేర్కొంది. చెవిలో నొప్పి, చెవిలో భారం కూడా గుండెపోటు లక్షణం కావచ్చునని అమెరికన్ నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ (ఎన్‌సీబీఐ) ప్రచురించిన పరిశోధనలో వెల్లడించింది.ఈ అధ్యయనం ప్రకారం.. గుండెపోటు సమయంలో రక్తం గడ్డకట్టడం గుండె సిరల్లో అడ్డంకిని కలిగించడమే కాకుండా, ఈ గడ్డలు చెవి సిరల్లోకి కూడా చేరుతాయి. ఇది చెవి నొప్పి, భారం లేదా వినికిడి లోపం వంటి సమస్యలను కలిగిస్తుంది.

**500 మంది రోగులపై పరిశోధన:** పరిశోధకులు 500 మందికి పైగా హృద్రోగులను అధ్యయనం చేశారు. గుండెపోటు వచ్చిన రోగులలో 12% మందికి చెవి సంబంధిత సమస్యలు ఉన్నాయని కనుగొన్నారు. ఈ వ్యక్తులలో చాలామంది చెవులలో నొప్పిని అనుభవించారు. కొందరు చెవుల్లో బరువు లేదా వినికిడి లోపంతో సమస్యలను ఎదుర్కొన్నారు.


### నిపుణుల అభిప్రాయం ప్రకారం..

ఈ అధ్యయనం ప్రధాన పరిశోధకుడైన డా. డేవిడ్ మిల్లర్ మాట్లాడుతూ.. చెవిలో నొప్పి లేదా భారం గుండెపోటు సంభావ్య లక్షణం కావచ్చన్నారు. ప్రత్యేకించి ఇది అకస్మాత్తుగా, స్పష్టమైన కారణం లేకుండా చెవి నొప్పి సంభవించినప్పుడు.. వెంటనే వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యమన్నారు. అయితే, చెవి నొప్పి లేదా బరువు మాత్రమే గుండెపోటుకు సంకేతం కాదని కూడా ఆయన వివరించారు. ఇది చెవి ఇన్ఫెక్షన్, సైనస్ లేదా మైగ్రేన్ వంటి ఇతర సమస్యల లక్షణం కూడా కావచ్చన్నారు. అందువల్ల, ఖచ్చితమైన కారణాన్ని తెలుసుకోవడానికి వైద్యుడిని సంప్రదించడం అవసరమంటూ తెలిపారు.ఛాతీ నొప్పి లేదా శ్వాసలోపం వంటి కొన్నిసార్లు గుండెపోటు, సాంప్రదాయిక లక్షణాలు కనిపించవని కూడా ఈ అధ్యయనం చూపించింది. అటువంటి పరిస్థితిలో, చెవి నొప్పి, భారం వంటి కనిపించని లక్షణాలపై దృష్టి పెట్టడం అవసరం. ముఖ్యంగా వృద్ధులు, మధుమేహ రోగులలో, ఇది గుండెపోటుకు సంకేతం.. గుండెపోటుపై అవగాహన పెంచడంతోపాటు అందులో దాగివున్న లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, తద్వారా సరైన సమయంలో చికిత్స చేయవచ్చని డాక్టర్ మిల్లర్ చెప్పారు.

### గుండెపోటు లక్షణాలు ఎలా ఉంటాయంటే..

గుండెలో ఆకస్మికంగా నొప్పి వస్తుంది.. ఛాతీలో నొప్పి, బిగుతుగా ఉండటం.. ఒత్తిడి.. తీవ్రమైన నొప్పి దవడ నుంచి మెడ వరకూ పాకుతుంది. ఆకస్మిక మైకము, వికారం, శరీరం అంతా చెమటలు పట్టి చల్లగా అయిపోతుంది. ఊపిరి తీసుకోవడానికి కూడా చాలా ఇబ్బంది పడుతుంటారు. వేగవంతమైన హృదయ స్పందన, కడుపులో అసౌకర్యం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

## చెడు కొలెస్ట్రాల్‌ను వేగంగా తగ్గించే కూరగాయలు ఏంటో తెలుసా



గుండె, మెదడుకు తగినంత రక్త సరఫరా జరగకపోవడం వల్ల గుండెపోటు, స్ట్రోక్ సంభవిస్తాయి. అయితే, మీరు చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించవచ్చు. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించే అనేక కూరగాయలు ఉన్నాయి.అధిక కొలెస్ట్రాల్‌ను సైలెంట్ కిల్లర్ అని కూడా అంటారు. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరగడం ప్రారంభించినప్పుడు, అది ధమనులలో చేరడం ప్రారంభమవుతుంది. దీని కారణంగా గుండె, మెదడుకు రక్త ప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. గుండె, మెదడుకు తగినంత రక్త సరఫరా జరగకపోవడం వల్ల గుండెపోటు, స్ట్రోక్ సంభవిస్తాయి. అయితే, మీరు చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించవచ్చు. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించే అనేక కూరగాయలు ఉన్నాయి. అధిక కొలెస్ట్రాల్‌ను సైలెంట్ కిల్లర్ అని కూడా అంటారు. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుంది. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరగడం ప్రారంభించినప్పుడు, అది ధమనులలో చేరడం ప్రారంభమవుతుంది. దీని కారణంగా గుండె, మెదడుకు రక్త ప్రసరణకు ఆటంకం ఏర్పడుతుంది. గుండె, మెదడుకు తగినంత రక్త సరఫరా జరగకపోవడం వల్ల గుండెపోటు, స్ట్రోక్ సంభవిస్తాయి. అయితే, మీరు చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించవచ్చు. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించే అనేక కూరగాయలు ఉన్నాయి.

**1 / 7**

పాలకూర- దీనిని తీసుకోవడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. బచ్చలికూర ధమనులలో కొలెస్ట్రాల్ పేరుకుపోవడానికి అనుమతించదు. రోజూ బచ్చలికూర తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. కొలెస్ట్రాల్ స్థాయి స్వయంచాలకంగా తగ్గుతుంది.

పాలకూర- దీనిని తీసుకోవడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. బచ్చలికూర ధమనులలో కొలెస్ట్రాల్ పేరుకుపోవడానికి అనుమతించదు. రోజూ బచ్చలికూర తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. కొలెస్ట్రాల్ స్థాయి స్వయంచాలకంగా తగ్గుతుంది.

**2 / 7**

ఓక్రా (బెండకాయ)- ఓక్రాలో కరిగే ఫైబర్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా పెక్టిన్, ఇది పేగులలో బైల్ యాసిడ్‌లు, కొలెస్ట్రాల్‌ను బంధించడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. బెండకాయలో శ్లేష్మం కూడా ఉంటుంది. ఇది జెల్ లాంటి పదార్థం. ఇది శరీరం నుండి టాక్సిన్స్, అదనపు కొలెస్ట్రాల్‌ను బయటకు పంపడంలో సహాయపడుతుంది. లేడీఫింగర్ రెగ్యులర్ వినియోగం మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుంది.ఓక్రా (బెండకాయ)- ఓక్రాలో కరిగే ఫైబర్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా పెక్టిన్, ఇది పేగులలో బైల్ యాసిడ్‌లు, కొలెస్ట్రాల్‌ను బంధించడం ద్వారా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. బెండకాయలో శ్లేష్మం కూడా ఉంటుంది. ఇది జెల్ లాంటి పదార్థం. ఇది శరీరం నుండి టాక్సిన్స్, అదనపు కొలెస్ట్రాల్‌ను బయటకు పంపడంలో సహాయపడుతుంది. లేడీఫింగర్ రెగ్యులర్ వినియోగం మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుంది.

**3 / 7**

బ్రోకలీ- శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడే అనేక రకాల పోషకాలు ఇందులో ఉన్నాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్‌తో పాటు ఫైటోకెమికల్స్ కూడా ఉన్నాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, మంటను తగ్గించడంలో సహాయపడతాయి.

బ్రోకలీ- శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడే అనేక రకాల పోషకాలు ఇందులో ఉన్నాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్‌తో పాటు ఫైటోకెమికల్స్ కూడా ఉన్నాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, మంటను తగ్గించడంలో సహాయపడతాయి.

**4 / 7**

క్యారెట్లు- క్యారెట్‌లో కరిగే ఫైబర్, ముఖ్యంగా పెక్టిన్ పుష్కలంగా ఉంటాయి. ఇది పేగులో కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు సహాయపడుతుంది. క్యారెట్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, బీటా కెరోటిన్ ధమనులలో ఆక్సీకరణ ఒత్తిడి, వాపును నివారించడంలో కూడా పాత్ర పోషిస్తాయి. దీన్ని తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

క్యారెట్లు- క్యారెట్‌లో కరిగే ఫైబర్, ముఖ్యంగా పెక్టిన్ పుష్కలంగా ఉంటాయి. ఇది పేగులో కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు సహాయపడుతుంది. క్యారెట్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, బీటా కెరోటిన్ ధమనులలో ఆక్సీకరణ ఒత్తిడి, వాపును నివారించడంలో కూడా పాత్ర పోషిస్తాయి. దీన్ని తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

**5 / 7**

వంకాయలో కరిగే ఫైబర్ కూడా ఉంటుంది. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ పేగులలో కొలెస్ట్రాల్ శోషణను నెమ్మదిస్తుంది. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. వంకాయలో యాంటీఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి. ఇవి రక్త నాళాలను ఆక్సీకరణ నష్టం నుండి కాపాడతాయి. వంకాయలో కరిగే ఫైబర్ కూడా ఉంటుంది. ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ పేగులలో కొలెస్ట్రాల్ శోషణను నెమ్మదిస్తుంది. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. వంకాయలో యాంటీఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి. ఇవి రక్త నాళాలను ఆక్సీకరణ నష్టం నుండి కాపాడతాయి.

**6 / 7**

కాలే - ఇది ఒక క్రూసిఫెరస్ కూరగాయలు. ఇందులో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కాలేలో ఉండే ఫైబర్ రక్తం నుండి అదనపు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడుతుంది. ఇది మీ ఆహారంలో చేర్చడానికి గుండె ఆరోగ్యకరమైన కూరగాయగా మారుతుంది.

కాలే - ఇది ఒక క్రూసిఫెరస్ కూరగాయలు. ఇందులో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కాలేలో ఉండే ఫైబర్ రక్తం నుండి అదనపు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడుతుంది. ఇది మీ ఆహారంలో చేర్చడానికి గుండె ఆరోగ్యకరమైన కూరగాయగా మారుతుంది.

## అజీర్తి సమస్యలకు అసలు కారణం అదే ముందు ఆ అలవాటు మార్చుకోండి



కడుపు ఆరోగ్యం బాగా లేకుంటే మూడ్ కూడా బాగోదు. జీర్ణకోశ రుగ్మతల కారణంగా తరచూ కడుపులో నొప్పి, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. దీంతో దాదాపు ప్రతిరోజూ గ్యాస్ బర్న్ సమస్య వేధిస్తుంది అయితే, ఈ గ్యాస్-గుండె మంట ప్రధాన కారణం గతితప్పిన ఆహారపు అలవాట్లు. నిబంధనలకు విరుద్ధంగా తినడం వల్ల ఈ విధమైన లక్షణాలు కనిపించడం ప్రారంభమవుతుంది. ముఖ్యంగా నూనె-మసాలా ఆహారం, ఫాస్ట్ ఫుడ్, శీతల పానీయాలు ఎక్కువగా తీసుకుంటే జీర్ణ రుగ్మత సమస్య అంత తేలికగా వదిలిపోదు. అజీర్తి సమస్య రాకుండా ఉండాలంటే ఆహార అలవాట్లు మార్చుకోవాలి. కానీ చాలామందికి ఇంట్లో తయారుచేసిన ఆహారం తిన్న తర్వాత కూడా ఇదే విధమైన జీర్ణ సమస్యలతో బాధపడుతుంటారు. కాబట్టి ఆహారంతో పాటు, జీవనశైలిని కూడా మార్చుకోవాలి. అజీర్తిని నివారించడానికి ఇక్కడ కొన్ని ఆయుర్వేద చిట్కాలు ఉన్నాయి. వీటిని ఫాలో అయితే కడుపు సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది.

### మధ్యాహ్నం తర్వాత ఫాస్ట్ ఫుడ్ తినకూడదు

కొన్నిసార్లు రుచికరమైన, ఫాస్ట్ ఫుడ్ కనిపిస్తే తినకుండా ఉండలేరు. అది పిజ్జా అయినా, బిర్యానీ అయినా.. వీటిని మధ్యాహ్నం భోజనంలో అస్సలు తీసుకోకూడదు. ఇటువంటి భారీ, కొవ్వు పదార్థాలను మధ్యాహ్నం, రాత్రి సమయంలో తీసుకోవడం పూర్తిగా నివారించాలి. ఈ అలవాటు మార్చుకుంటే దాదాపు సగం జీర్ణ సమస్యలను దూరం చేసుకోవచ్చు. అలాగే బరువు కూడా అదుపులో ఉంటుంది.

### రోజూ వాకింగ్ చేయాలి

బద్ధకంగా జీవించడం వల్ల జీర్ణ సమస్యలను నివారించలేం. మధ్యాహ్నం అయినా, రాత్రి అయినా భోజనం చేసి పడుకోవడం మంచి అలవాటు కాదు. బదులుగా భోజనం తర్వాత 30 నిమిషాలు నడవడం అలవాటు చేసుకోవాలి. ఇలా చేస్తే ఆహారం త్వరగా జీర్ణం అవుతుంది. అలాగే అనేక వ్యాధుల ప్రమాదాన్ని నివారించవచ్చు.

## దేవర - పుష్ప - గేమ్ ఛేంజర్..

# అక్కడ బజ్ ఎలా ఉంది?



పుష్ప సినిమాలు మాత్రమే తమిళనాడులో కొంత ప్రభావం చూపించాయి. తమిళ్ ప్రేక్షకులకి కనెక్ట్ అయ్యి మంచి వసూళ్లు సాధించాయి. తమిళ స్టార్ హీరోల సినిమాలకి తెలుగులో కూడా మంచి మార్కెట్ ఉంటుంది. కొన్ని సినిమాలైతే తమిళంలో కంటే తెలుగులోనే పెద్ద హిట్స్ అయ్యాయి. అయితే తెలుగు సినిమాలకి మాత్రం తమిళంలో పెద్దగా ఆదరణ ఉండదు. మన స్టార్ హీరోల చిత్రాలని తమిళ్ ఆడియన్స్ ఆదరించిన సందర్భాలు చాలా తక్కువ. బాహుబలి సిరీస్, ఆర్ఆర్ఆర్. పుష్ప సినిమాలు మాత్రమే తమిళనాడులో కొంత ప్రభావం చూపించాయి. తమిళ్ ప్రేక్షకులకి కనెక్ట్ అయ్యి మంచి వసూళ్లు సాధించాయి. పుష్ప-2 సెట్స్‌లో దీనికి అనుమతి లేదు! అయితే ఇప్పుడిప్పుడే తమిళ్ ఆడియన్స్ ఆలోచన కూడా మారుతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం తెలుగులో అరడజనుకి పైగా పాన్ ఇండియా సినిమాలు భారీ బడ్జెట్ తో తెరకెక్కినవి ప్రేక్షకుల ముందుకి రాబోతున్నాయి. వీటిలో మోస్ట్ అవైటెడ్ మూవీగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప ది రూల్ ఉంది. ఈ సినిమాపై దేశ వ్యాప్తంగా హైప్ నెలకొని ఉంది. పుష్ప మూవీ నుంచి వచ్చిన ఫస్ట్ సింగ్ కి తమిళంలో కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సాంగ్ కి ఇప్పటి వరకు 6.8 మిలియన్ వ్యూస్ వచ్చాయి. అలాగే 91కె లైక్స్ రావడం విశేషం. యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న యాక్షన్ ప్యాక్డ్ మూవీ దేవర. ఈ సినిమా ఫస్ట్ సాంగ్ కి కూడా తమిళంలో మంచి ఆదరణ లభించింది. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందించారు. మూవీ నుంచి వచ్చిన ఫియర్ సాంగ్ కి 6.2 మిలియన్ వ్యూస్ రాగా 201కె లైక్స్ వచ్చాయి. అంటే లైక్స్ పరంగా దేవర ఫియర్ సాంగ్ తమిళంలో టాప్ లో నిలిచిందని చెప్పొచ్చు. అలాగే గ్లోబల్ స్టార్ రామ్ చేంజర్ మూవీ నుంచి వచ్చిన ఫస్ట్ సాంగ్ 2.5 మిలియన్ వ్యూస్ 51కె లైక్స్ సొంతం చేసుకుంది. శంకర్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ మూడు సినిమాలలో పుష్ప సినిమాకి ఎక్కువ వ్యూస్ రావడానికి కొన్ని రీజన్స్ ఉనాన్ని. పుష్ప మొదటి పార్ట్ తమిళంలో హిట్ అయ్యింది. వారి నేటివిటీకి పుష్ప ది రూల్ మూవీ దగ్గరగా ఉంటుంది.

## పాపం రాధిక ను

# విలన్ చేశారు, కానీ..!



మెహబూబా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నేహా శెట్టి

మెహబూబా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నేహా శెట్టి. ఆ సినిమా నిరాశ పరిచినా కూడా వెంటనే గల్లీ రౌడీ సినిమాలో నటించింది. ఆ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడింది. టాలీవుడ్ లో రాణించడం కష్టమే అనుకుంటున్న సమయంలో అనూహ్యంగా డీజే టిల్లు తో హిట్ దక్కించుకుంది. డీజే టిల్లు సినిమాలో రాధిక పాత్రలో నటించిన నేహా శెట్టికి మంచి మార్కులు పడ్డాయి. అందంతో పాటు అభినయం తో మెప్పించింది. సినిమా విడుదల అయ్యి చాలా కాలం అయినా కూడా ఇంకా ప్రేక్షకులు రాధిక... రాధిక అంటూ తెగ ఊగిపోతూనే ఉన్నారు. ఇటీవల వచ్చిన టిల్లు స్క్వేర్ సినిమాలో కూడా నేహా శెట్టి నటించిన విషయం తెల్సిందే. మొత్తానికి నేహా శెట్టి కి మంచి ఆఫర్లు దక్కుతున్నాయి. అయితే రాధిక అనే పాత్రను చాలా మంది నెగటివ్ గా చూస్తున్నారు. అబ్బాయిలను మోసం చేసే వారిని రాధిక అంటూ సోషల్ మీడియా ద్వారా అమ్మాయిల గురించి ట్రోల్స్ చేయడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో నేహా శెట్టి తన తాజా సినిమా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా ప్రమోషన్ లో భాగంగా రాధిక పాత్ర గురించి స్పందించింది. చాలా మంది రాధిక ను నెగటివ్ క్యారెక్టర్ గా చూస్తున్నారు. ఆ పాత్రకు మరీ ఇంత నెగిటివిటీ వస్తుందని నేను అనుకోలేదు. ఆ పాత్ర విషయంలో చాలా సన్నని గీత ఒకటి ఉంది. టిల్లూ పై ప్రేమ విషయంలో రాధిక ను అనుమానించడానికి లేదు. ఆమె కొన్ని కారణాల వల్ల చెడ్డ వ్యక్తులతో స్నేహం చేయాల్సి వచ్చిందని,

# గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి

**నటీనటులు:**

విశ్వక్సేన్-నేహా శర్మ-అంజలి-గోపరాజు రమణ-నాజర్-హైపర్ ఆది-మయాంక్ పరాఖ్-వినోద్ కిషన్ తదితరులు

**సంగీతం:**

యువన్ శంకర్ రాజా

**ఛాయాగ్రహణం:**

అనిత్ మదాడి

**నిర్మాత:**

సూర్యదేవర నాగ వంశీ

**రచన-దర్శకత్వం:**

కృష్ణచైతన్య సినిమా


సినిమాకూ వైవిధ్యం చూపిస్తూ.. అడపాదడపా హిట్లు కొడుతూ యువ ప్రేక్షకుల్లో మంచి గుర్తింపే సంపాదించాడు విశ్వక్సేన్. అతడితో రౌడీ ఫెలో.. ఛల్ మోహన రంగ చిత్రాలతో దర్శకుడిగా తనదైన ముద్ర వేసిన కృష్ణచైతన్య జట్టు కట్టాడు. వీరి కలయికలో వచ్చిన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ప్రేక్షకుల్లో బాగానే అంచనాలు పెంచింది. ఈ రోజే రిలీజైన ఈ చిత్రం ఆ అంచనాలను ఏమేర అందుకుందో చూద్దాం పదండి.

**కథ:**

గోదావరి ప్రాంతంలోని కొవ్వూరులోని లంకలో అనాథగా పెరిగిన రత్నాకర్ అలియాస్ రత్న (విశ్వక్సేన్)కు పెద్ద పెద్ద కలలుంటాయి. తప్పులు.. మోసాలు చేసి అయినా పెద్ద స్థాయికి ఎదగాలనుకుంటాడు. ఈ క్రమంలోనే ఒక దొంగతనం చేసి సబ్బుల డీలర్ షిప్ సంపాదిస్తాడు. ఆ తర్వాత ఎమ్మెల్యే దొరస్వామిరాజు (గోపరాజు) రమణ దగ్గర చేరి ఆయనకు నమ్మిన బంటుగా మారతాడు. దొరస్వామిరాజు ప్రత్యర్థి అయిన నానాజీ (నాజర్) కూతురైన బుజ్జి (నేహాశెట్టి)తో ప్రేమలో పడ్డ రత్న.. నాటకీయ పరిణామాల మధ్య నానాజీ సాయంతోనే దొరస్వామిరాజు మీద ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుస్తాడు. ఇలా ఎదురు లేకుండా సాగిపోయిన రత్నకు.. అధికారం చేపట్టాకే అసలు సమస్యలు మొదలవుతాయి. ఆ సమస్యలేంటి.. దీంతో తన జీవితం ఎలాంటి మలుపులు తిరిగింది.. అతడి కథకు ముగింపు ఏంటి అన్నది మిగతా

**కథ. కథనం-విశ్లేషణ:**

హాలీవుడ్లో 'గాడ్ ఫాదర్' సినిమా ఒక ఎవర్ గ్రీన్ క్లాసిక్. వ ం ల ్డ సినిమాలో అత్యంత విజయవంతమైన ఫార్ములాగా దీన్ని చెప్పొచ్చు. సాధారణ స్థాయి నుంచి మొదలుపెట్టిన ఒక వ్యక్తి.. అసాధారణ స్థాయికి ఎదిగి ఒక పెద్ద సామ్రాజ్యాన్ని నిర్మించే క్రమాన్ని ఆధారంగా చేసుకుని వందల కథలు వచ్చాయి. ఇండియన్ సినిమాలో కూడా ఈ లైన్ మీద ఎన్నో సినిమాలు వచ్చాయి. కాకపోతే ఆయా కథల బ్యాక్ డ్రాప్ మారుతుంటాయి. తెలుగులో బ్లాక్ బస్టర్ అయిన 'పుష్ప'లోనూ ఇలాంటి కథనే చూడొచ్చు. అక్కడ సుకుమార్ ఎర్రచందనం నేర సామ్రాజ్యాన్ని నేపథ్యంగా ఎంచుకున్నాడు. ఇప్పుడు కృష్ణచైతన్య గోదావరి ప్రాంతంలో ఎవరూ పెద్దగా టచ్ చేయని లంకల నేపథ్యాన్ని తీసుకుని 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' అనే గ్యాంగ్ స్టర్ డ్రామాను ప్రేక్షకులకు అందించాడు. అతను ఎంచుకున్న ఆ బ్యాక్ డ్రాపే సినిమాలో మేజర్ హైలైట్. కథ తెలిసినట్లుగా సాగిపోతున్నా.. ఒక డిఫరెంట్ సెటప్ లో సాగే కథనం.. ఆసక్తికరంగా సాగే సన్నివేశాలు.. మంచి విజువల్స్.. ఇంటెన్స్ బ్యాగ్రౌండ్ స్కోర్ ఈ సినిమాను రొటీన్ కు భిన్నమైన సినిమాలా నిలబెడతాయి. ముందే అన్నట్లు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ఒక ఫార్ములాతో సాగిపోయే కథే. జీరోగా మొదలుపెట్టి.. పెద్ద స్థాయికి ఎదిగి.. అక్కడ్నుంచి పతనమై.. చివరికి తన జీవితానికి ఒక అర్థవంతమైన ముగింపునివ్వడానికి ప్రయత్నించే వ్యక్తి కథ ఇది. "గొప్ప వాడు కావాలంటే.. సిగ్గు వదిలేయాలి" అంటూ ఆరంభంలో హీరో చెప్పే డైలాగులోనే తన క్యారెక్టర్ ఏంటో అర్థమైపోతుంది. ఇలాంటి ఆలోచన ధోరణి ఉన్నవాడు.. పెద్ద వాడైపోవడానికి ఏం చేస్తాడు అనే క్రమంలోనే 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ప్రథమార్థం నడుస్తుంది. లంక గ్రామాల నేపథ్యం ఎంచుకోవడం వల్ల కొత్త తరహా సన్నివేశాలు చూస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. తాను ఎదగడానికి మనుషుల్ని హీరో అడ్డంగా వాడుకునే తీరు వినోదాన్ని పంచుతుంది. తన ప్లాన్లు అన్నీ ఈజీగా వర్కవుట్ అయిపోవడం.. అతను చకచకా మెట్లు ఎక్కేయడం కొంచెం కన్వీనియెంట్ గా అనిపించినా.. సన్నివేశాలు ఎక్కడా బోరింగ్ గా మాత్రం అనిపించవు. హీరో ఎమ్మెల్యే పంచన చేరి.. ఆ ఎమ్మెల్యే మీదే పోటీ చేసి గెలిచే క్రమం ప్రేక్షకులకు మంచి కిక్కు ఇస్తుంది. మధ్యలో చిన్న రొమాంటిక్ ట్రాక్ యువ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇంటర్వెల్ బ్లాక్ లో వచ్చే యాక్షన్ ఎపిసోడ్ మాస్ ప్రేక్షకులకు విందే. విశ్వక్ ఈ ఎపిసోడ్లో చెలరేగిపోయాడు. హీరో ఎలివేషన్ కూడా బాగా పండింది. ఇంటర్వెల్ వరకు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' మంచి హైలో నడుస్తుంది. ఐతే ఒక వ్యక్తి ఎదుగుతున్నపుడు వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులు ఉత్సాహం తెప్పించడం కామన్. అదే సమయంలో ఆ వ్యక్తి పతనం అవుతున్నపుడు కొంత నిరాశ ఆవహిస్తుంది. అందుకే ద్వితీయార్ధంలో కొంచెం డల్లుగా మారిన ఫీలింగ్ కలుగుతుంది. రైటర్ కమ్ డైరెక్టర్ కృష్ణచైతన్య కూడా ద్వితీయార్థాన్ని ఇంకొంచెం మెరుగ్గా తీర్చిదిద్దుకోవాల్సింది. ఒక దశ వరకు రసవత్తరంగా అనిపించిన డ్రామా.. తర్వాత కొంచెం పలచనగా మారిన ఫీలింగ్ కలుగుతుంది. కానీ గ్రాఫ్ తగ్గుతున్న టైంలో కొన్ని సీన్లు కొంచెం ఉత్సాహాన్నిస్తాయి. గోదారిలో పడవ మీద జరిగే సెటిల్మెంట్ సీన్ అందులో ఒకటి. ఇలాంటి సీన్లు ద్వితీయార్థంలో మరి కొన్ని పడి ఉంటే 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' మరింత హై ఇచ్చేది. సినిమాకు ఇచ్చిన ముగింపు ఓ మోస్తరుగా అనిపిస్తుంది. క్లైమాక్స్ ప్రేక్షకులు ఊహించుకున్నట్లు ఉండదు. దర్శకుడు పతాక సన్నివేశాలను కొంచెం సున్నితంగానే తీర్చిదిద్దాడు. ఐతే రత్న పాత్రకు ఇచ్చిన పేఆఫ్ మాత్రం బాగుంది. మొత్తంగా చూస్తే 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' మాస్ ప్రేక్షకులను మెప్పిస్తూనే.. రొటీన్ కమర్షియల్ సినిమాల మధ్య కొంచెం భిన్నమైన మూవీగా నిలుస్తుంది. కొన్ని లోపాలున్నా.. ద్వితీయార్ధంలో గ్రాఫ్ తగ్గినా.. ఓవరాల్ గా ఒక్కసారి చూసేందుకు లోటు లేని సినిమా ఇది.




**నటీనటులు:**

విశ్వక్సేన్ కు లంకల రత్నాకర్ కెరీర్లో ఎప్పటికీ చెప్పుకునే పాత్ర అవుతుంది. తనకు ఇప్పటిదాకా ఉన్న ఇమేజ్ ను మించి ఒక పెద్ద గ్రాఫ్ ఉన్న పాత్ర చేశాడు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'లో. కెరీర్లో ఎదుగుతున్న యువ నటుడికి ఇలాంటి పాత్ర దక్కడం అరుదే. ఇలాంటి పాత్రలను ఇమేజ్ ఉన్న స్టార్లు చేస్తేనే బాగుంటుందనిపిస్తుంది. కానీ విశ్వక్ తన పెర్ఫామెన్స్ తో బాగానే మేనేజ్ చేయగలిగాడు. డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రలో అన్ని రసాలనూ చక్కగా పండించాడు. ముఖ్యంగా తన పాత్రలో వేరే కోణాలను చూపించే సన్నివేశాల్లో అతను చెలరేగిపోయాడు. కొన్ని సీన్లలో విశ్వక్ పెర్ఫామెన్స్ మాస్ ప్రేక్షకులతో ఈలలు వేయిస్తుంది. హీరోయిన్ నేహా శెట్టికి కూడా పెర్ఫామెన్స్ స్కోప్ ఉన్న పాత్ర దక్కింది. ఒక పాటలో గ్లామర్ షో చేసిన నేహా.. సంప్రదాయ పల్లెటూరి అమ్మాయి పాత్రలో చక్కగా ఒదిగిపోయింది. కొన్ని సీన్లలో చక్కగా నటించి మెప్పించింది. అంజలి నటిగా మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. వేశ్య పాత్రను అందరూ కన్విన్సింగ్ గా పోషించలేరు. కానీ అంజలి పాత్రకు తగ్గట్లుగా నటించి తన ప్రొఫెషనలిజాన్ని చాటింది. చిన్న చిన్న సహాయ పాత్రలు పోషించే గోపరాజు రమణకు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'లో కీలకమైన పాత్ర దక్కింది. ఆ అవకాశాన్ని ఆయన బాగా ఉపయోగించుకున్నారు. విలన్ కాని విలన్ పాత్రలో ఆయన అదరగొట్టారు. నాజర్ తక్కువ సన్నివేశాల్లోనే తన అనుభవాన్ని చూపించారు. తమిళ నటుడు వినోద్ కిషన్ తక్కువ నిడివి ఉన్న పాత్రలో ఓకే అనిపించాడు. హీరో పక్కన సహాయ పాత్రలో హైపర్ ఆదితో పాటు మరో నటుడు ఆకట్టుకున్నారు. లంకల్లో ఉండే రౌడీల పాత్రల్లో నటించిన ఆర్టిస్టులందరూ బాగా చేశారు.

**సాంకేతిక వర్గం:**

సాంకేతికంగా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'లో ఉన్నత ప్రమాణాలు కనిపిస్తాయి. యువన్ శంకర్ రాజా బ్యాగ్రౌండ్ స్కోర్ తో అదరగొట్టేశాడు. సినిమా ఆద్యంతం బీజీఎం మంచి ఇంటెన్సిటీతో సాగుతుంది. పాటలు మరీ గొప్పగా లేకపోయినా తీసిపడేసేలా లేవు. సినిమాలో అలా అలా సాగిపోతాయి. అనిత్ ఛాయాగ్రహణం సినిమాలో మరో హైలైట్. విజువల్స్ ఆద్యంతం ఆకట్టుకుంటాయి. నిర్మాణ విలువలు బాగున్నాయి. సితార సంస్థ విశ్వక్ మార్కెట్ స్థాయికి మించి ఖర్చు పెట్టింది. సినిమాలో మంచి క్వాలిటీ కనిపిస్తుంది. రైటర్ కమ్ డైరెక్టర్ కృష్ణచైతన్య.. తన కలం పదును చూపించాడు. తన తొలి చిత్రం 'రౌడీ ఫెలో'లో మాదిరే ఇందులోనూ మంచి డైలాగులు రాశాడు. "గొప్పోడవ్వాలంటే సిగ్గు వదిలేయాలి".. "వాడితో దెబ్బలాడేంత చనువుంది కానీ.. మార్చేంత లేదు" లాంటి డైలాగులు సినిమాలో సందర్భానికి తగ్గట్లుగా బాగా కుదిరాయి. కృష్ణచైతన్య ఎంచుకున్న కథ కొత్తదేమీ కాకపోయినా.. బోర్ కొట్టని కథనంతో ఆసక్తికరంగా నడిపించాడు. ప్రథమార్థంలో దర్శకుడు మంచి బిగి చూపించాడు. ద్వితీయార్థంలోనూ కొన్ని సీన్లలో మెరుపులు ఉన్నా.. గ్రాఫ్ కొంచెం తగ్గింది. ఓవరాల్ గా రచయితగా.. దర్శకుడిగా కృష్ణచైతన్యకు మంచి మార్కులే పడతాయి.

**చివరగా: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి..ఇంటెన్స్ గ్యాంగ్ స్టర్ డ్రామా**

**రేటింగ్- 2.75/5**

# విజయ్.. ఒకటి కాదు మూడు!



ఇళయదళపతి విజయ్ హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మూవీ ఇళయదళపతి విజయ్ హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మూవీ గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ అనేది ఈ టైటిల్ మీనింగ్. టైం ట్రావెల్ కాన్సెప్ట్ తో వెంకట్ ప్రభు ఈ చిత్రాన్ని సిల్వర్ స్క్రీన్ పై ఆవిష్కరించే పనిలో ఉన్నారు. మీనాక్షి చౌదరి ఈ చిత్రంలో విజయ్ కి జోడీగా కనిపించబోతోందంట. ఇదిలా ఉంటే ఈ సినిమాలో విజయ్ డ్యూయల్ రోల్ లో కనిపించబోతున్నాడని ఇప్పటికే స్పష్టత వచ్చింది. ఇందులో ఒక క్యారెక్టర్ లో టీనేజ్ యువకుడిగా కూడా విజయ్ ని చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ క్యారెక్టర్ కోసం సరికొత్త టెక్నాలజీ ఉపయోగించి లుక్స్ పరంగా వేరియేషన్ తీసుకొచ్చారంట. భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా ఈ మూవీ రెడీ అవుతోంది. దళపతి విజయ్ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకొని మూవీ చేస్తున్నారు. ఫ్యాన్స్ ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమాకి సంబంధించి మరో ఇంటరెస్టింగ్ న్యూస్ బయటకొచ్చింది. ఈ చిత్రంలో మరో ఆసక్తికరమైన పాత్రలో కూడా విజయ్ కనిపించబోతున్నాడంట. ఈ క్యారెక్టర్ ని రివీల్ చేయకుండా ప్రేక్షకులకి సర్ప్రైజ్ ఇవ్వడం కోసం దర్శకుడు వెంకట్ ప్రభు సీక్రెట్ గా ఉంచారంట. మూవీలో ఆ రోల్ కి చాలా ప్రత్యేకత ఉంటుందంట. ఈ న్యూస్ బట్టి %+ూాా% లో దళపతి విజయ్ నుంచి ట్రిపుల్ ట్రీట్ ప్రేక్షకులకి అందనుందనే మాట వినిపిస్తోంది. అంటే మూడు విభిన్నమైన లుక్స్ తో విజయ్ ఆకట్టుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే %+ూాా% మూవీ రిలీజ్ కానుంది. దీని తర్వాత విజయ్ మరొక్క సినిమా మాత్రమే చేయనున్నాడు. ఇప్పటికే విజయ్ రాజకీయ పార్టీని స్థాపించి తమిళ రాజకీయాలలో కీలక భూమిక పోషించడానికి రెడీ అవుతున్నాడు. మరొక్క మూవీ కంప్లీట్ చేసి పూర్తి స్థాయిలో రాజకీయాలపై ఫోకస్ చేయనున్నారు. రెండేళ్ల తర్వాత తమిళనాడులో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా రెడీ అవుతున్నారు. రాజకీయాలలోకి రావడంతో సినిమాలు పూర్తిగా మానేస్తున్నట్లు విజయ్ ప్రకటించాడు. ఈ కారణంగానే %+ూాా% మూవీపైన ఫ్యాన్స్ చాలా హోప్స్ పెట్టుకున్నారు. %+ూాా%తో పాటు రాబోయే సినిమా కూడా బ్లాక్ బస్టర్ హిట్ అయితే ఫ్యాన్స్ కి గొప్ప ట్రీట్ లా ఉంటుందని అభిమానులు భావిస్తున్నారు. డైరెక్టర్ వెంకట్ ప్రభు చివరిగా తెలుగులో కస్టడీ మూవీతో డిజాస్టర్ అందుకున్నారు. అయితే తన స్టామినా ఏంటనేది %+ూాా% మూవీతో మళ్ళీ చూపించుకోవాలని గట్టిగానే కష్టపడుతున్నారు.

%Editor, Printed, Published and Owned by RACHAKONDACHANDRASEKHAR RAO%, »»%HNO-14-15/3, INDIRA GANDHI NAGAR, VELDURTHI, VELDURTHI MANDAL, KURNOOL DIST, ANDHRAPRADESH..RNI APTEL/2023/88231 Printed at SK PUBLICATIONS, S.NO-46-683-A. BUDHAWARA PETA, KURNOOL DIST-518002, AP . E-mail: yuvatharamtelugudaily@gmail.com, Cell: +9199899 24749.